ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
కడప
జిల్లా వార్తలు
5
శుక్రవారం 5 జనవరి 2024



ఇది చచ్చిన ప్రభుత్వంతో సమానం

"న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని మొత్తుకుంటున్నా ప్రభుత్వం స్పందించడం లేదు. ఇది చచ్చిన ప్రభుత్వంతో సమానం" అంటూ మున్సిపల్ కార్మికులు ప్రభుత్వ దిష్టిబొమ్మకు అంత్యక్రియలు నిర్వహించారు. పదిరోజులుగా సమ్మె చేస్తున్నా వైసీపీ ప్రభుత్వ పెద్దలు స్పందించకపోవడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. సమ్మె విఫలం చేసేందుకు అధికారులు ఎంత ప్రయత్నించినా కార్మికులు వెనక్కి తగ్గడంలేదు. ఇక.. అంగన్వాడీలూ ఆందోళనలు కొనసాగించారు. 5వ తేదీ లోగా విధుల్లోకి రావాలని ప్రభుత్వం జారీ చేసిన జీవో ప్రతులను దహనం చేశారు. పలుచోట్ల పొర్లుదండాలతో నిరసన తెలిపారు. జగన్ ఇచ్చిన హామీలు అమలు చేసే వరకు పోరు ఆపేదే లేదన్నారు.



కడపలో ప్రభుత్వ దిష్టిబొమ్మకు శవయాత్ర నిర్వహిస్తున్న మున్సిపల్ కార్మికులు

- న్యాయమైన సమస్యలు పరిష్కరించాలని సమ్మె చేసినా పట్టించుకోరా..?
- ఆగ్రహం వ్యక్తం చేసిన మున్సిపల్ కార్మికులు
- ప్రభుత్వ దిష్టిబొమ్మతో శవయాత్ర
- విధుల్లోకి రావాలంటూ ప్రభుత్వం ఆదేశాలు
- సమస్యలు పరిష్కరించకుండా విధుల్లోకి రమ్మంటారా అంటూ..
- జీవో ప్రతులు దహనం చేసిన అంగన్వాడీలు
- రోజురోజుకూ ఉధృతమవుతున్న కార్మికుల పోరు

(కడప-ఆంధ్రజ్యోతి): న్యాయమైన సమస్యలను పరిష్కరించాలంటూ సమ్మె చేస్తున్న అంగన్వాడీ, మున్సిపల్ కార్మికులపై ప్రభుత్వం కరుణ చూపడంలేదు. అంగన్వాడీలకు జీతాలు పెంచమని చేసే డిమాండ్లు పట్టించుకోకుండా వదిలేసింది. అయినా మొక్కవోని దీక్షతో ఆందోళన కొనసాగిస్తున్నారు. ఈ నెల 5లోపు విధుల్లో చేరాల్సిందేనంటూ కలెక్టరు విజయరామరాజు ఆదేశాలు జారీ చేశారు. వచ్చే నెలలో ముఖ్యమైన పథకాలు ఉన్నాయని అర్హులకు అందించాలంటూ విధుల్లోకి హాజరుకావాలన్నారు. అయితే న్యాయమైన కోరికలను తీర్చే వరకూ విధుల్లోకి హాజరుకామని అంగన్వాడీలు తెగేసి చెబుతున్నారు.

జీవో ప్రతులు దహనం

సమాన పనికి సమాన వేతనం రూ.26వేలు ఇవ్వాలంటూ అంగన్వాడీలు డిమాండ్ చేస్తున్నారు. గురువారానికి సమ్మె 24వ రోజుకు చేరుకుంది. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి బాగా లేదని, అయినా సమ్మె చేస్తున్నారంటూ ప్రభుత్వం తమపై దుష్ప్రచారం చేస్తోందని అంగన్వాడీలు ఆవేదన వ్యక్తం చేశారు. 24 రోజులుగా కుటుంబాలను, పిల్లలను రోడ్డులో వదిలి పండుగ, పబ్బాలు చేసుకోకుండా పొద్దున లేచినాంచి సమస్యల పరిష్కారం కోసం రోడ్లెక్కినా ప్రభుత్వం పట్టించుకోవడం లేదని కార్యకర్తలు ఆగ్రహం వ్యక్తం చేశారు. కడపలోని అర్బన్ ఐసీడీఎస్ కార్యాలయం వద్ద మా మొర ఆలకించు జగనన్నా అంటూ ఒంటికాలిపై నిరసన తెలిపారు. రూరల్ కార్యాలయం ఎదుట ధర్నా చేపట్టారు. బద్వేలులో విధులకు హాజరుకావాలంటూ ప్రభుత్వం జారీ చేసిన జీవో ప్రతులను అంగన్వాడీ కార్యకర్తలు దహనం చేశారు. పోరుమామిళ్లలో ఆటోను తాడుతో లాగుతూ ర్యాలీ చేశారు. కొండాపురంలో పొర్లుదండాలు పెట్టారు. చాపాడు, ముద్దనూరు, జమ్మలమడుగులో ధర్నా నిర్వహించారు.

దిష్టిబొమ్మతో శవయాత్ర

"కరోనా కాలంలో బయటికి రావాలంటే ప్రతిఒక్కరూ భయపడుతుంటే కార్మికులు ప్రాణాలకు తెగించి వీధులు శుభ్రం చేశారు. లక్ష ఇచ్చినా కూడా ఇలాంటి సేవలు ఎవరూ చేయలేరని పొగిడిన సీఎం వైఎస్ జగన్.. ఇప్పుడు న్యాయమైన డిమాండ్ల కోసం పదిరోజులుగా సమ్మె చేస్తున్నా ఎందుకు పట్టించుకోలేదు" అని మున్సిపల్ కార్మికులు నిలదీశారు. అవుట్ సోర్సింగ్, కాంట్రాక్టు ఉద్యోగులకు తేడా ఏం లేదని సీఎం జగన్ అసెంబ్లీ సాక్షిగా చెప్పారని, మా ప్రభుత్వం వస్తే అందరినీ రెగ్యులర్ చేస్తామన్నారని అన్నారు. నాలుగున్నరేళ్లుగా ఎదురు చూసినా ఫలితం లేదు. ఇక విధిలేక రోడ్డెక్కామని మండిపడ్డారు. దేశ సర్వోన్నత న్యాయస్థానం సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలంటూ తీర్పునిచ్చింది. సుప్రీంకోర్టు తీర్పునూ అమలు చేయడంలేదు. ఆఖరుకు తనే ఇచ్చిన హామీలు కూడా అమలు చేయడం లేదు. దీంతో ఈ ప్రభుత్వం చచ్చినదాంతో సమానం అంటూ కడప మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయం ఎదుట కార్మికులు ఆందోళనకు దిగారు. ముందుగా కళ్లకు గంతలు కట్టుకుని నిరసన తెలిపారు. అనంతరం ప్రభుత్వ దిష్టబొమ్మకు పాడెకట్టి శవయాత్ర నిర్వహించారు. ఈ



ప్రభుత్వ దిష్టిబొమ్మ పాడెవద్ద విలపిస్తున్న మున్సిపల్ కార్మికులు

ప్రభుత్వం చచ్చిపోయిందంటూ పాడెవద్ద కార్మికులు భోరుమంటూ విలపించి నిరసన వ్యక్తం చేశారు. అనంతరం ప్రభుత్వ పాడెతో రైతుబజారు బ్రిడ్జి వరకు ఊరేగింపుగా వెళ్లారు. ఇక ప్రొద్దుటూరులో పొర్లుదండాలు పెట్టి నిరసన తెలిపారు. బద్వేలులో కళ్లకు గంతలు కట్టుకుని నిరసన తెలిపారు.



విధులకు రావాలంటూ ప్రభుత్వం ఇచ్చిన జీవో ప్రతులను బద్వేలులో దహనం చేస్తున్న అంగన్వాడీలు



కొండాపురంలో అంగన్వాడీల పొర్లుదండాలు



తాగి.. తోలేస్తున్నారు

- జైలుకెళుతున్నా ఆగని మందుబాబుల జోరు
- ఒక్క ఏడాదిలో 670 డ్రంకెన్ అండ్ డ్రైవ్ కేసులు

కడప (క్రైం), జనవరి 4: మద్యం మత్తులో వాహనాలు నడుపుతున్న వారిని పోలీసులు పట్టుకుని జైలుకు పంపినా కొందరిలో మార్పు రావడం లేదు. మళ్లీ తాగేసి వాహనాలు తోలుతున్నారు. వీరి కారణంగా ఎదురుగా వచ్చే వాహనదారులు కూడా ప్రమాదాల బారిన పడాల్సి వస్తోంది. ఇటీవల పోలీసులు కడప నగరంలో సాయంత్రం, రాత్రివేళల్లో బ్రీత్ ఎనలైజరుతో తనిఖీలు చేపడుతుండడంతో మందుబాబులు అడ్డంగా దొరికిపోతున్నారు. వీరిపై పోలీసులు కేసులు నమోదు చేసి కోర్టులో హాజరుపరుస్తున్నారు. డ్రంకెన్ అండ్ డ్రైవ్ కేసుల్లో పట్టుబడ్డ వారికి 3 రోజుల నుంచి నెలరోజుల వరకు శిక్ష పడుతోంది. అయినా కొందరిలో మార్పు కనిపించక మద్యం సేవించి వాహనాలు నడుపుతున్నారు. కడప నగరంలోనే గతేడాది జనవరి నుంచి డిసెంబర్ వరకు 670 డ్రంకెన్ అండ్ డ్రైవ్ కేసులు నమోదు చేశారు. వీరిలో ద్విచక్ర వాహనదారులే అధికంగా ఉన్నారు.

కొందరు యువకులు రాత్రివేళ మద్యం సేవించి ద్విచక్ర వాహనాల సైలెన్సర్లు తొలగించి సర్కస్ ఫీట్లు చేస్తూ కేకలు వేస్తూ తిరుగుతుంటారు. అలాంటి వారికి చెక్ పెట్టేందుకు ఎస్పీ సిద్ధార్థ్ కౌశల్ ప్రత్యేక దృష్టి సారించారు. ప్రత్యేక బృందాలు ఏర్పాటుచేసి రాత్రి వేళల్లో తనిఖీలు ముమ్మరంగా చేపడుతున్నారు. కడప నగరంలో అధిక వేగంతో వెళ్లే బైకులతో పాటు మద్యం సేవించి నడిపే వారి బండ్లు పది రోజులపాటు పట్టుకుని జిల్లా పోలీసు కార్యాలయ ఆవరణలో ఉంచారు. దాదాపు వెయ్యి మందికి పైగానే ద్విచక్రవాహనదారులకు ఎస్పీ కౌన్సెలింగ్ చేశారు. అయినా కూడా కొందరు వాహనదారులలో మార్పు కనిపించడంలేదు. మందేసి బండ్లు తోలుతున్నారు.

అధిక శాతం ద్విచక్ర వాహనదారులే

మద్యం సేవించి వాహనాలు నడిపి పట్టుబడుతున్న వారిలో ఎక్కువగా ద్విచక్ర వాహనదారులు ఉండగా, ఆటో డ్రైవర్లు కూడా మద్యం సేవించి పట్టుబడుతున్నారు. కొంత మంది యువకులు బార్లలో కాకుండా ఊరి చివరి ప్రాంతాలకు వెళ్లి అక్కడ తాగి వస్తున్నారు. దీంతో పోలీసులు ప్రధాన రహదారులతో పాటు మిగిలిన సర్కిళ్లలో పరీక్షలు నిర్వహిస్తుండటంతో వీరు దొరికిపోతున్నారు.

మందుబాబులకు జైలుశిక్ష

మద్యం తాగి వాహనాలు నడుపుతూ పట్టుబడితే పోలీసులు కేసు నమోదు చేసి వారిని న్యాయాధికారి ఎదుట హాజరుపరుస్తున్నారు. పర్సంటేజీ తక్కువగా ఉన్న వారికి వెయ్యి నుంచి పదివేల రూపాయల వరకు జరిమానా, మూడురోజుల నుంచి నెలరోజుల పాటు జైలుశిక్ష విధిస్తున్నారు. కడప నగరంలో డిసెంబరు 19న మద్యం సేవించి ఆటో నడుపుతున్న ఓ యువకుడిని ట్రాఫిక్ పోలీసులు పట్టుకున్నారు. అతన్ని కడప ఫస్ట్‌క్లాస్ స్పెషల్ జేఎస్‌టీఎఫ్ కోర్టులో హాజరుపరచగా ఆ యువకునికి ఏడు రోజులు జైలుశిక్షతో పాటు రూ.2,500 జరిమానా విధించారు. అలాగే 16వ తేదీన మరో ఆటో డ్రైవరును పట్టుకుని అదే కోర్టులో హాజరుపరచగా 30 రోజులు జైలుశిక్షతో పాటు రూ.2,500 జరిమానా విధించారు. ఓ ద్విచక్రవాహనదారుడు మద్యం తాగి పట్టుబడ్డాడు. అతన్ని కోర్టులో హాజరుపరచడంతో ఏడురోజులు జైలుశిక్షతో పాటు రూ.2500 జరిమానా విధించారు. ఇటీవల మద్యం తాగిన వారిలో ద్విచక్ర వాహనదారులతో పాటు ఆటోలు నడుపుతున్న వారు కూడా పట్టుబడుతున్నారు. ప్రయాణికులు సైతం ఆటో డ్రైవర్లను గమనించాలని, వారు మద్యం సేవించి ఉంటే అలాంటి వారి ఆటో ఎక్కకూడదని పోలీసు అధికారులు సూచిస్తున్నారు.

ప్రత్యేక నిఘా ఉంచాం..



డ్రంకెన్ అండ్ డ్రైవ్‌కు సంబంధించి ఎస్పీ ఆదేశాల మేరకు ప్రత్యేక నిఘా ఉంచాం. ప్రతిరోజూ ప్రత్యేక బృందాలుగా ఏర్పడి వాహనాలు తనిఖీ చేస్తున్నాం. మద్యం తాగి పట్టుబడితే వారిని కోర్టులో హాజరుపెడుతున్నాం. మద్యం తాగిన వాహనదారుడికి జైలుశిక్షతో పాటు జరిమానా కూడా పడుతుంది. మద్యం సేవించి వాహనాలు నడపడం ప్రమాదకరం. ట్రాఫిక్ నిబంధనలు ప్రతిఒక్కరూ పాటించాలి.

- సీతారామిరెడ్డి, కడప ట్రాఫిక్ సీఐ

'జగన్ సీఎం కాకుంటే.. రాజకీయాల నుంచి విరమించుకుంటా'

కడప, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని ఓ ఎమ్మెల్యే వైఎస్ జగన్‌కు వీరవిధేయుడు. తన దాతృత్వంతో జిల్లాలోనే ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్నారు. దౌర్జన్యాలు, భూకబ్జాలు, హత్యలు, బెట్టింగులతోనూ అంతకుమించి గుర్తింపు పొందారు. ఎన్నికలు దగ్గర పడేకొద్దీ ఈయనకు ఓటమి భయం పట్టుకుంది. నాలుగున్నర సంవత్సరాలలో తాము సాగించిన దుర్మార్గాలు వచ్చే ఎన్నికల్లో ప్రభావం చూపుతాయని భావిస్తున్నారు. అంతేకాకుండా సీఎం వైఎస్ జగన్ ఆ పార్టీలో దాదాపు సగంమంది సిట్టింగ్ ఎమ్మెల్యేలను మారుస్తుండటం, రాష్ట్రంలో టీడీపీ క్రమంగా బలం పుంజుకోవడంతో ఈయనలో ఆందోళన నెలకొంది. ఇటీవల మీడియా వారితో ఆఫ్‌ది రికార్డ్ అని మాట్లాడుతూ ఈసారి జగన్ సీఎం కాకుంటే.. తాను రాజకీయాల నుంచి శాశ్వతంగా తప్పుకుంటానని చెప్పారు. దీంతో ఆయన వెంట ఉన్న ద్వితీయ శ్రేణి నాయకులు ఆశ్చర్యపోయారు. ఆ ఎమ్మెల్యే మాటలను బట్టి ఈసారి వైసీపీ అధికారంలోకి రాదని స్పష్టమైపోతోందని అక్కడున్నవారు గుసగుసలు పోయారు.

వేధిస్తే పుట్టగతులుండవు

- యూటీఎఫ్ నేతల హెచ్చరిక



కలెక్టరేట్ ఎదుట యూటీఎఫ్ ఆధ్వర్యంలో ఉపాధ్యాయుల ధర్నా

కడప (ఎడ్యుకేషన్), జనవరి 4 : ఉద్యోగ, ఉపాధ్యాయులను వేధిస్తే ప్రభుత్వానికి పుట్టగతులుండవని యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి లక్ష్మీరాజా, జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మాదన విజయకుమార్, పాలెం మహేశ్‌బాబు హెచ్చరించారు. ఉద్యోగ ఉపాధ్యాయుల అండతో వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిందన్నారు. పీఎఫ్, ఏపీజీఎల్ఐ నిధులను ప్రభుత్వం దోపిడీ చేసిందన్నారు. గురువారం కడప కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వైఎస్ జగన్ తాము అధికారంలోకి వస్తే ఉద్యోగ, ఉపాధ్యాయుల సమస్యలన్నింటినీ పరిష్కరిస్తామని హామీ ఇచ్చి అధికారంలోకి వచ్చాక నిట్టనిలువునా మోసం చేశారని ఆరోపించారు. ఈ నాలుగున్నరేళ్లలో ఉద్యోగ ఉపాధ్యాయులకు ఒనగూరిందేమీ లేదన్నారు. ఉద్యోగులకు చెల్లించాల్సిన పీఆర్సీ, డీఏ, మెడికల్ రీయింబర్స్‌మెంటు బకాయిలను చెల్లించకపోగా వారి అవసరాల కోసం దాచుకున్న పీఎఫ్, ఏపీజీఎల్ఐ సొమ్ము సైతం రాష్ట్ర ప్రభుత్వం కాజేసిందన్నారు. ఉద్యోగులు తమ పిల్లల చదువులు, వైద్యఖర్చులు, గృహ నిర్మాణాల కోం దరఖాస్తు చేస్తే సంవత్సరాల తరబడి చెల్లించలేదన్నారు. పదవీ విరమణ పొందిన ఉద్యోగుల తుది చెల్లింపులు సైతం ఈ ప్రభుత్వం చేయలేదంటే ఉద్యోగ, ఉపాధ్యాయులను ఏ స్థాయిలో వేధింపులకు గురి చేస్తుందో అర్థం చేసుకోవచ్చన్నారు. సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు చంద్రశేఖర్, జిల్లా కార్యదర్శి రామ్మోహన్, చెన్నకేశవులు, ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి సునీల్‌కుమార్, నగిలి రాజేంద్రప్రసాద్ తదితరులు ధర్నాకు మద్దతు తెలిపారు. యూటీఎఫ్ నాయకులు ఎన్.నాగార్జునరెడ్డి, వై.రవికుమార్, సుజాతారాణి, కె.నరసింహారావు, రవీంద్రుడు, రూత్ ఆరోగ్య మేరీ తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగాలను పర్మినెంటు చేయాలి

- ఆశాల డిమాండ్

కడప (మారుతీనగర్), జనవరి 4: ఆశా కార్యకర్తలను మెడికల్ ఉద్యోగులుగా గుర్తించి పర్మినెం టు చేయాలని, అంతవరకు వారికి కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు, ఆశా యూని యన్ జిల్లా గౌరవ అధ్యక్షుడు గుంటి వేణుగోపాల్ పాలక ప్రభుత్వాలను డిమాండ్ చేశా రు. అపరిష్కృతంగా ఉన్న ఆశా వర్కర్ల సమస్యలను త్వరితగ తిన పరిష్కరించాలన్నారు. ఏపీ ఆశావర్కర్స్ యూనియన్ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు గురువారం స్థానిక పాత రిమ్స్‌లోని ఆయుష్మాన్ భారత్ డాక్టర్ వైఎస్సార్ పట్టణ ఆరోగ్య కేంద్రం ఎదుట నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 18 ఏళ్లుగా ఎలాంటి ఉద్యోగ భద్రత లేక కనీస వేతనం, సాధారణ సెలవులు, మెటర్నిటీ సెలవులు కూడా లేకుండా పాలక ప్రభుత్వాలు ఆశాలతో వెట్టిచాకిరి చేయించుకున్నారని నిప్పులు చెరిగారు. పెరిగిన ధరలకు అనుగుణంగా సుప్రీంకోర్టు గైడెన్స్ ప్రకారం కనీస వేతనం రూ.26వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. అలాగే సామాజిక భద్రత రిటైర్‌మెంటు బెనిఫిట్స్ కింద రూ.5లక్షలు, పదివేల రూపాయల సెక్షన్ గ్రాడ్యుటీ కూడా ఇవ్వాలన్నారు. ఏదేని కారణంతో ఆశావర్కర్ చనిపోతే రూ.10లక్షలు ప్రమాద బీమా సౌకర్యం, ఇంట్లో ఒకరికి ఉద్యోగం కల్పించాలన్నారు. ఐదేళ్లుగా పెండింగులో ఉన్న డీఏ, టీఏ, లెప్రసీ, మలేరియా, కరోనా అలవెన్స్ మొత్తం చెల్లించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఆశావర్కర్ సీనియర్ నగర అధ్యక్ష కార్యదర్శులు నరసమ్మ, శాంతమ్మతో పాటు దేవి, లోకేశ్వరి, శ్రీదేవి, శైలజ, శివకుమారి, పార్వతీ తదితరులు పాల్గొన్నారు.



కడప పాతరిమ్స్ వద్ద వైఎస్ఆర్ పట్టణ ఆరోగ్య కేంద్రం ఎదుట ఆశా కార్యకర్తలు చేపట్టిన నిరసనలో మాట్లాడుతున్న గుంటి వేణుగోపాల్

ప్రొద్దుటూరు ఈఆర్వో రామ్మోహన్ సస్పెన్షన్



ప్రొద్దుటూరు, జనవరి 4: ప్రొద్దుటూరు నియోజకవర్గ ఓటరు జాబితా రిజిస్ట్రేషన్ అధికారి ఈఆర్వో రామ్మోహన్‌ను రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి ముఖేశ్ కుమార్ మీనా సస్పెండ్ చేశారు. జీఎన్ఎస్ఎస్ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్‌గా ఉన్న ఈయనకు ఈఆర్వోగా బాధ్యతలు అప్పగించారు. అయితే.. ఓటర్ల సవరణ జబితాలో అక్రమాలు జరిగాయని దీనికి ఈఆర్వోనే కారణమంటూ టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి ప్రవీణ్‌కుమార్‌రెడ్డి ఎన్నికల సంఘానికి ఇచ్చిన ఫిర్యాదు చేశారు. ప్రొద్దుటూరు నియోజకవర్గంలో మొత్తం 35 పోలింగ్ కేంద్రాల్లో మృతుల ఓట్లు 1,621, వలస వెళ్లినవారి ఓట్లు 232 ఉన్నట్లు ఆధారాలతో ఆయన ఫిర్యాదులో పేర్కొన్నారు. దీనిపై విచారణ చేపట్టిన ఎన్నికల అధికారులు ఈఆర్వో బాధ్యతా రాహిత్యంతో తప్పులు దొర్లినట్లు తేల్చి ఆయనపై సస్పెన్షన్ వేటు వేశారు. ఏఈఆర్వోలు, ఎన్నికల డీటీ, బీఎల్వో సిబ్బంది నిర్లక్ష్యంపై కూడా విచారణ జరుగుతోంది. వీరిలో కొందరిపై వేటు పడే అవకాశాలు ఉన్నాయి.



రామ్మోహన్, ఈఆర్వో

బద్వేలులో ఇద్దరి హత్య

- మృతులిద్దరూ అన్నదమ్ములు
- పట్టపగలు నడిరోడ్డుపై దాడి
- ఉలిక్కిపడ్డ బద్వేలు

బద్వేలు టౌన్, జనవరి 4: ప్రశాంతంగా ఉన్న బద్వేలులో ఒక్కసారిగా అల్లరిమూకలు గొడవలు చెలరేగి అన్నదమ్ములు హత్యకు గురయ్యారు. నడిరోడ్డుపై కత్తులు, రాళ్లతో వీరంగం సృష్టించడంతో ఒక్కసారిగా బద్వేలు ప్రాంతం ఉలిక్కిపడింది. పోలీసులు, బాధతుల కథనం మేరకు వివరాలిలా..

బద్వేలు పట్టణం మేదర వీధిలో నివాసం ఉంటున్న లకిడి విజయ్ కొడుకులు లకిడి ప్రమోద్, లకిడి ధనుష్. గాంధీనగర్‌లో నివాసం ఉంటున్న వెంకటసుబ్బయ్య కొడుకులు పసుపులేటి ప్రశాంత్ (28), పసుపులేటి సాయికుమార్ (24) ఒకప్పుడు కలసి జట్టుగా ఉండేవారు. వీరి మధ్య ఏమి జరిగిందో ఏమో కానీ గురువారం ఉదయం ఘర్షణ పడ్డారు. అనంతరం 11గంటల సమయంలో టీ తాగేందుకు పసుపులేటి ప్రశాంత్, పసుపులేటి సాయికుమార్ తమ తండ్రి వెంకటసుబ్బయ్యతో కలసి సిద్దవటం రోడ్డు అగ్నిమాపక కేంద్రం సమీపంలో టీ బంకు వద్ద వేచి ఉన్నారు. అదే సమయంలో అక్కడకు లకిడి విజయ్ తన ఇద్దరు కుమారులు మరో ఐదుగురితో కలసి ఆటోలో వచ్చారు. వీరిని చూడగానే ముందస్తు జాగ్రత్తగా తెచ్చుకున్న కత్తులను ప్రశాంత్, సాయికుమార్ బయటకు తీశారు. వెంటనే విజయ్ అతని కొడుకులు వారివెంట వచ్చినవారు కలసి రాళ్లతో దాడి చేసి కత్తులు లాక్కున్నారు. అదే కత్తులతో అన్నదమ్ములిద్దరినీ పొడిచి పారిపోయారు.

సమాచారం తెలుసుకున్న సీఐ యుగంధర్ హుటాహుటిన సంఘటన స్థలానికి చేరుకున్నారు. తీవ్ర రక్తస్రావమైన పసుపులేటి ప్రశాంత్ అక్కడికక్కడే మృతి చెందాడు. కొన ఊపిరితో కొట్టుమిట్టాడుతున్న సాయికుమార్‌ను ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యంలో మృతి చెందాడు. మృతదేహాలను బద్వేలు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అనంతరం డీఎస్పీ వంశీధర్ గౌడ్ అక్కడికి చేరుకుని పూర్వాపరాలు పరిశీలించారు. మృతుల తండ్రి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. కాగా.. నిందితులను పోలీసులు అదుపులోకి తీసుకుని విచారిస్తున్నట్లు సమాచారం. ఇందుకు సంబంధించిన పూర్తి వివరాలు త్వరలో వెల్లడిస్తామని సీఐ తెలిపారు. కాగా.. మృతి చెందిన వారిలో పసుపులేటి ప్రశాంత్ (28)కు భార్య శివపూజిత, కుమార్తె ఉన్నారు. పసుపులేటి సాయికుమార్(24)కు భార్య అమల ఉన్నారు. ఇటీవలే సాయికుమార్‌కు వివాహం జరగడంతో ఆ కుటుంబ సభ్యుల రోదన అంతా ఇంతా కాదు.



పోలీసుల అదుపులో నిందితులు



మృతి చెందిన పసుపులేటి ప్రశాంత్



మృతి చెందిన పసుపులేటి సాయికుమార్

కుప్పకూలిన రియల్ వ్యాపారం

- అగ్రిమెంట్లపైనే చేతులు మారుతున్న స్థలాలు
- వ్యాపారాలు లేక అప్పులకు వడ్డీలు పెరిగి లబోదిబోమంటున్న పెట్టుబడిదారులు


రైల్వేకోడూరు మండలంలో వేసిన ఇళ్ల ప్లాట్లు

రైల్వేకోడూరు, జనవరి 4: నియోజకవర్గమైన రైల్వేకోడూరులో రియల్ ఎస్టేట్ వ్యాపారం కుప్పకూలింది. చాలా కాలంగా కేవలం అగ్రిమెంట్లతోనే స్థలాలు చేతులు మారుతుండడంతో ప్లాట్ల క్రయ, విక్రయాలు ఆగిపోయాయి. దీంతో పెట్టిన పెట్టుబడులు నిలిచిపోయి రియల్ వ్యాపారులు లబోదిబోమంటున్నారు. వివరాల్లోకి వెళితే... నియోజకవర్గంలో వేలాది మంది కువైత్, బెహరిన్, దుబాయ్, మస్కట్, సౌదీ, మలేషియా తదితర దేశాలకు జీవనోపాధి కోసం వెళ్లి ఉన్నారు. అక్కడ సంపాదించుకున్న డబ్బులతో గతంలో ఇక్కడ ఇళ్ల ప్లాట్ల కొనుగోలు జోరుగా సాగేవి. కరోనా తర్వాత రియల్ వ్యాపారం మందగించింది. మైసూరివారిపల్లె, అనంతరాజుపేట గ్రామాల సమీపాల్లో ఎక్కువగా ఇళ్ల ప్లాట్లు వేసి ఉన్నారు. దీంతో ప్లాట్లు వేసిన రియల్ వ్యాపారులు డబ్బులు వడ్డీలకు తెచ్చి పెట్టుబడి పెట్టారు. కానీ ఇందుకు వడ్డీలు పెరుగుతున్నాయే తప్ప ఎటువంటి ప్రయోజనం లేదని వ్యాపారులు వాపోతున్నారు. కరోనాకు ముందు రియల్ వ్యాపారం ముమ్మరంగా సాగినా.. ఆ తర్వాత పాతాళానికి పడిపోయింది. రైల్వేకోడూరు పట్టణం నుంచి గ్రామాలకు రియల్ వ్యాపారం పాకింది. ప్లాట్లు ముమ్మరంగా వేసినా క్రయ విక్రయాలు సాగడం లేదు. కేవలం అగ్రిమెంట్ల వరకే పరిమితమైంది. పూర్తి విక్రయం అయితే రియల్ వ్యాపారులకు మేలు జరుగుతుంది. కానీ అగ్రిమెంట్ల మీదే చేతులు మారుతుండడంతో పెట్టిన పెట్టుబడికి లాభాలు కనిపించడం లేదని రియల్ వ్యాపారులు వాపోతున్నారు. కోట్లాది రూపాయలు ఖర్చు పెట్టి ప్లాట్లు తయారు చేయడమే కాకుండా ముందు భాగంలో ఆర్చీలు ఏర్పాటు, రోడ్లు, తాగునీటి వసతి, చెట్లు, అనుమతులు తీసుకునే వరకు లక్షలు ఖర్చు చేస్తున్నారు. రైల్వేకోడూరు నుంచి రాజంపేట వైపు వెళ్లే మార్గం, తిరుపతి వెళ్లే మార్గంలో చాలా వరకు ప్లాట్లు వేసి ఉన్నారు. వ్యవసాయ భూముల్లో కూడా ప్లాట్లు వేస్తున్నారు. ఈ ప్లాట్లను పుల్లంపేట, చిట్వేలి మండల కేంద్రాల్లో ఉన్న సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో రిజిస్ట్రేషన్లు చేయించుకుంటారు. అయితే క్రయ, విక్రయాల రిజిస్ట్రేషన్లు ముమ్మరంగా సాగడం లేదు. గల్ఫ్ దేశాలకు వెళ్లిన వారు ఎక్కువగా తిరుపతిలో స్థిరపడుతుండడంతో రైల్వేకోడూరులో రియల్ వ్యాపారం పడిపోవడానికి ఒక కారణమైంది. దీంతో వ్యాపారులు దిక్కుతోచని స్థితిలో ఉండిపోయారు. ఇదిలా ఉంటే చాలా వరకు రెవెన్యూ శాఖ అనుమతులు లేక నిలిచిపోయి ఉన్నాయి.

రియల్ వ్యాపారం పడిపోయింది



రియల్ వ్యాపారం పడిపోయింది. తెచ్చిన డబ్బులకు వడ్డీలు పెరిగిపోతున్నాయి. క్రయ, విక్రయాలు సక్రమంగా జరగడం లేదు. అగ్రిమెంట్ పైనే రియల్ వ్యాపారం జరుగుతోంది. క్రయ, విక్రయాలు సాగితేనే వ్యాపారం సాఫీగా జరుగుతుంది. డైరెక్టుగా రిజిస్ట్రేషన్లు జరగడం లేదు. దీంతో రియల్ వ్యాపారులు ఇబ్బందులు పడుతున్నారు.

- చలపతి, రియల్ వ్యాపారి, రైల్వేకోడూరు

కరోనా తర్వాత వ్యాపారం మందగించింది



కరోనా తర్వాత రియల్ వ్యాపారం పూర్తిగా పడిపోయింది. ఎక్కువ శాతం తిరుపతి వంటి నగరాల్లో ప్లాట్లు తీసుకుంటున్నారు. స్థానికంగా ఉండే వారు మాత్రమే రైల్వేకోడూరులో కొనుగోలు చేస్తున్నారు. అప్పులు తెచ్చి రియల్ వ్యాపారం మీద పెట్టుబడులు పెట్టిన చాలా మందికి వడ్డీలు కూడా గిట్టుబాటు కావడం లేదు.

- బాలాంజనేయులు, రియల్ వ్యాపారి, రైల్వేకోడూరు

జిల్లాలో ఫైలేరియా నిర్ధారణ పరీక్షలు


ఫైలేరియా నిర్ధారణ పరీక్షలు చేస్తున్న దృశ్యం

సంబేపల్లె, జనవరి 4: జిల్లా వ్యాప్తంగా ప్రతి మండలం నుంచి రెండు గ్రామాల్లో ఫైలేరియా నిర్ధారణ రక్త పరీక్షలను రాత్రి సమయంలో సేకరిస్తున్నట్లు జిల్లా మలేరియా అధికారి బి.వేణుగోపాల్ తెలిపారు. గురువారం ఆయన మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా ఈ సర్వే చేస్తున్నారని, ఇందులో భాగంగా సంబేపల్లెలో 5 టీంలు రాత్రి 8-11 గంటల వరకు 300 మందికి నైట్ బ్లడ్ సర్వే రక్త నమూనాలు సేకరించామన్నారు. రాయచోటి సబ్ యూనిట్ పరిధిలో సంబేపల్లె, దేవపట్ల, చిన్నమండెం, కొత్తపల్లె, యండపల్లె, మాధవరం, బోయపల్లి, టి.సుండుపల్లె, సిద్దారెడ్డిగారిపల్లె, మడితాడు గ్రామాల్లో 3 నుంచి 5వ తేదీ వరకు నైట్ బ్లడ్ సర్వే ద్వారా దాదాపు 3 వేల మందికి రక్తనమూనాలు సేకరించి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల ల్యాబ్‌లో ఫైలేరియా నిర్ధారణ పరీక్షలు చేస్తామన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ రామచంద్ర, మలేరియా సబ్‌యూనిట్ అధికారులు ప్రసాద్‌యాదవ్, జయరామయ్య, ఆరోగ్య అధికారులు, జీఎస్ రాణి, సదాశివరెడ్డి, కృష్ణవేణి, రవిశంకర్, వెంకటేశ్, వరలక్ష్మి, పద్మజ, పార్వతమ్మ, ప్రమీల, భాగ్య, మెహరూన్, ఎంఐహెచ్‌పీ సబ్రిన్, సాయిలీలా, ఆశాలు పాల్గొన్నారు.

భార్య హత్య కేసులో భర్త అరెస్టు

ఒంటిమిట్ట, జనవరి 4: మండల పరిధిలోని రాచగుడిపల్లె గ్రామంలో 15 రోజుల క్రితం భార్యను హత్య చేసిన నిందితుడిని అరెస్టు చేసినట్లు పోలీసులు తెలిపారు. గురువారం ఒంటిమిట్ట సీఐ పురుషోత్తంరాజు తెలిపిన వివరాల మేరకు.. భార్య అందే కృష్ణవేణిపై అనుమానం పెంచుకున్న భర్త అందే రామయ్య ఆమెతో తరచూ గొడవపడేవాడు. ఈ నేపథ్యంలో డిసెంబరు 15న రాత్రి 11 గంటల సమయంలో ఇంట్లో మంచంపై నిద్రిస్తున్న భార్య తలపై రోకలిబడెతో దాడి చేయగా, ఆమె తీవ్రంగా గాయపడిందని, బంధువులు హుటాహుటిన తిరుపతిలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ డిసెంబరు 30న మృతి చెందిందన్నారు. అప్పటి నుంచి నిందితుడి కోసం గాలిస్తుండగా గురువారం రాచగుడిపల్లెలోని మూడురోడ్ల కూడలి వద్ద రామయ్యను అరెస్టు చేసి రిమాండుకు తరలించామని సీఐ తెలిపారు.

హత్యాయత్నం కేసు నమోదు

సుండుపల్లె, జనవరి 4: సుండుపల్లె పోలీస్‌స్టేషన్‌లో హత్యాయత్నం కేసు నమోదైనట్లు పోలీసులు గురువారం తెలిపారు. కేవీపల్లి మండలం తూమాదిగపల్లెకు చెందిన బెత్తంపూరి నాగరాజు రాయవరం సమీపంలోని మామిడికాయల మండీ దగ్గర ఉండగా రాయవరానికి చెందిన పఠాన్ ఇంతియాజ్‌తో పాటు మరో ఏడుగురు కిడ్నాప్ చేసి చంపాలని ప్రయత్నించారని, కులంపేరుతో దూషించడంతో ఫిర్యాదు చేసినట్లు పేర్కొన్నారు. నాగరాజు ఐదు సంవత్సరాలుగా రాయవరంలో నివాసం ఉంటున్నాడు. ఈ మేరకు ఎస్సీ, ఎస్టీ కేసు, హత్యాయత్నం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

మద్యం బాటిళ్లు స్వాధీనం

కడప (క్రైం), జనవరి 4 : కడప నగరంలోని ఇండస్ట్రియల్ ఎస్టేట్‌లో అక్రమంగా మద్యం విక్రయిస్తున్న వ్యక్తిని అరెస్టు చేసి అతడి వద్ద గల 13 మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నట్లు రిమ్స్ పోలీసుస్టేషన్ సీఐ కె.రామచంద్ర, ఎస్ఐ పి.ప్రతాప్‌రెడ్డి తెలిపారు. గురువారం వారు విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి వివరాలు వెల్లడించారు. రిమ్స్ పోలీసుస్టేషన్ పరిధిలోని ఇండస్ట్రియల్ ఎస్టేట్‌లో అక్రమంగా మద్యం బాటిళ్లు విక్రయిస్తున్నాడన్న సమాచారం రాగానే రిమ్స్ సీఐ, ఎస్ఐలు తమ సిబ్బందితో కలిసి దాడులు చేశారు. ఆ ప్రాంతంలో అక్రమంగా మద్యం బాటిళ్లు విక్రయిస్తున్న నేతి కనకయ్యశెట్టి అనే వ్యక్తిని అరెస్టు చేశారు. అతడి నుంచి సుమారు రూ.2 వేల విలువ గల ఓల్డ్ అడ్మిరల్, దారు హౌస్, అలబార్ హౌస్ తదితర కంపెనీలకు చెందిన 13 మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. ఆ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు వారు తెలిపారు.

బంగారం చోరీ కేసులో వ్యక్తి అరెస్ట్

సింహాద్రిపురం, జనవరి 4: బంగారు నగల చోరీ కేసులో గురువారం ఓ వ్యక్తిని అరెస్ట్ చేసినట్లు సింహాద్రిపురం ఎస్ఐ ఎస్కే రోషన్ తెలిపారు. గురువారం మండలంలోని సుంకేసుల క్రాస్ రోడ్డు వద్ద అనుమానాస్పదంగా తిరుగుతున్న వ్యక్తిని అదుపులోకి తీసుకుని అతడి వద్ద ఉన్న సంచిలో సోదా చేయగా 26.5 గ్రాముల బంగారు గొలుసు, జత కమ్మలు, ఒక ఉంగరం లభించినట్లు తెలిపారు.

ఇటీవల జంగంరెడ్డిపల్లి గ్రామానికి చెందిన లింగదారి అరుణ, సైమన్ ఇంటిలో బంగారు నగలు చోరీకి గురి కావడంతో వారి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామన్నారు. అతడిని విచారించగా జంగంరెడ్డిపల్లిలో జరిగిన చోరీ ఆ వ్యక్తి చేసినట్లు ఒప్పుకోవడంతో అతడిపై కేసు నమోదు చేసి అరెస్ట్ చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

గుర్తు తెలియని మృతదేహం లభ్యం

వల్లూరు, జనవరి 4 : కడప - తాడిపత్రి జాతీయ రహదారి తోళ్లగంగనపల్లె సమీపంలోని ముళ్లపొదల్లో గురువారం గుర్తు తెలియని మృతదేహం లభ్యమైంది. మృతదేహాన్ని స్థానికులు చూసి పోలీసులకు సమాచారం అందించారు. సంఘటనాస్థలానికి పోలీసులు చేరుకుని మృతదేహాన్ని పరిశీలించారు. పోలీసుల సమాచారం మేరకు మృతదేహం ఐదారు రోజుల క్రితం చనిపోయినట్లు గుర్తించారు. పోలీసులు మృతదేహాన్ని పరిశీలించి దర్యాప్తు చేస్తున్నారు. సంఘటనాస్థలాన్ని పరిశీలించిన సీఐ రామక్రిష్ణారెడ్డి అన్ని కోణాల్లో కేసు దర్యాప్తు చేస్తామని వెల్లడించారు.

జూదరుల అరెస్టు

కడప (క్రైం), జనవరి 4 : కడప నగరంలోని వన్‌టౌన్ పోలీసుస్టేషన్ పరిధిలో పాత బస్టాండు వద్ద రవీంద్రనగర్‌కు వెళ్లే బ్రిడ్జి కింద జూదం ఆడుతున్న ఏడుగురిని అరెస్టు చేసినట్లు వన్‌టౌన్ ఎస్ఐ మధుసూదన్‌రెడ్డి తెలిపారు. వన్‌టౌన్ సీఐ భాస్కర్‌రెడ్డికి అందిన సమాచారం మేరకు... గురువారం ఎస్ఐ తన సిబ్బందితో వెళ్లి బ్రిడ్జి కింద మంగతాయి జూదమాడుతున్న ఏడుగురిని అదుపులోకి తీసుకున్నామన్నారు. వారి నుంచి పేక ముక్కలు, రూ.51,810 నగదు స్వాధీనం చేసుకుని పోలీసు ప్రొసీడింగ్స్ మేరకు అరెస్టు చేసి స్టేషన్‌కు తరలించి కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

జేబీ హాస్పిటల్‌లో రోబోటిక్ కీళ్ల మార్పిడి వైద్యసేవలు

- *డాక్టర్ జహంగీర్ బాషా*


శస్త్ర చికిత్స చేస్తున్న జహంగీర్ బాషా తదితరులు

కడప (సెవెన్‌రోడ్స్), జనవరి 4 : కడప నగరంలోని జేబీ హాస్పిటల్‌లో అత్యాధునిక రోబోటిక్ మెరుగైన వైద్యసేవలు అందించినట్లు ప్రముఖ కీళ్ల మార్పిడి నిపుణుడు డాక్టర్ జహంగీర్‌బాషా తెలిపారు. గురువారం ఆయన మీడియాతో మాట్లాడుతూ అమెరికాకు చెందిన జాన్సన్ అండ్ జాన్సన్ సంస్థ వారి బ్రాంచ్ చెన్నైలో రోబోటిక్ కీళ్ల మార్పిడి శస్త్రచికిత్సలో ప్రత్యేక శిక్షణ పొందినట్లు తెలిపారు. ఈ అత్యాధునిక రోబోటిక్ కీళ్ల మార్పిడిని మొట్టమొదటసారిగా కడపలో చేయనున్నట్లు తెలిపారు. ఇప్పటికే జిల్లా ప్రజలకు ఎన్నో మెరుగైన వైద్యసేవలు అందించినట్లు తెలిపారు. ఎంతోమంది వైద్య సేవల కోసం సుదీర్ఘ ప్రాంతాలకు వెళ్లి ఎన్నో ఇబ్బందులకు గురై బాధపడుతున్నారని అటువంటి వారి కోసం మా జేబీ హాస్పిటల్‌లో అతి తక్కువ ఖర్చుతో ఆపరేషన్లు అందుబాటులోకి తీసుకువచ్చామని తెలిపారు. కడప జిల్లా ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు.

ఆడశిశువును కాపాడుకుందాం : డీఎంహెచ్‌వో


సమావేశంలో మాట్లాడుతున్న డీఎంహెచ్‌వో కొండయ్య

రాయచోటిటౌన్, జనవరి 4: ఆడశిశువులను కాపాడుకోవడం ద్వారా సృష్టిని రక్షించుకుందామని అన్నమయ్య జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ కొండయ్య తెలిపారు. కలెక్టర్ ఆదేశాల మేరకు రాయచోటి పట్టణంలోని ఓ ప్రైవేటు కళాశాలలో జిల్లాలోని ప్రభుత్వ వైద్యులు, స్కానింగ్ సెంటర్ల వైద్యులు వివిధ శాఖల అనుబంధ జిల్లా అధికారులకు గర్భస్థ పిండ లింగనిర్ధారణ చట్టంపై కెపాసిటీ బిల్డింగ్ శిక్షణా కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా డీఎంహెచ్‌వో మాట్లాడుతూ అల్ట్రా సౌండ్ స్కానింగ్‌ను గర్భవతిగా ఉన్నప్పుడు ఆమెకు ఏవైనా గర్భస్థ పిండసమస్యలు ఉన్నాయేమోనని తెలుసుకోవడానికి మాత్రమే ఉపయోగించాలని, లింగ నిర్ధారణకు, భ్రూణ హత్యలకు వాడరాదని హెచ్చరించారు. ఏసీపీఎన్ డీటీ చట్టాన్ని కఠినంగా అమలు చేయాలన్నారు. ఐఎంఏ అధ్యక్షుడు డాక్టర్ చంద్రశేఖర్ మాట్లాడుతూ స్కానింగ్ కేంద్రాన్ని నిర్వహించే వారందరూ తప్పనిసరిగా రిజిస్ట్రేషన్ చేసుకోవాలని, అనైతికంగా కేంద్రాలు నిర్వహించే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలన్నారు. పీసీపీఎన్, డీటీ జిల్లా నోడల్ అధికారి డాక్టర్ ఉషశ్రీ మాట్లాడుతూ స్కానింగ్ సెంటర్ నిర్వాహకులు సమయానుగుణంగా రెన్యువల్ చేసుకోవాలని, లబ్ధిదారుల వివరాలు పోర్టల్‌లో అప్‌లోడ్ చేయాలని, కేంద్రాల్లో సీసీ కెమెరాలు అమర్చుకోవాలన్నారు. పీసీపీఎన్ డీటీ జిల్లా ప్రోగ్రాం అధికారి దేవశిరోమణి మాట్లాడుతూ బేటీబచావో, బేటీపడావో కార్యక్రమంలో భాగంగా ఆడశిశువును రక్షించుకుందాం- మానవజాతి మనుగడకు కాపాడుదామన్నారు. కార్యక్రమంలో రాయచోటి ఏరియా ఆసుపత్రి స్త్రీల వైద్య నిపుణురాలు డాక్టర్ కోటేశ్వరి, సోషల్ వెల్ఫేర్ డిప్యూటీ డైరెక్టర్ జాకీర్‌హుస్సేన్, డ్రగ్ ఇన్‌స్పెక్టర్ జయరాం, స్వచ్ఛంద సేవాసంస్థ ఆర్‌హెచ్‌జీబీఎంఎస్‌ఎస్ ప్రతినిధి బీవీ రత్నం, ఫోర్డ్ ఫౌండేషన్ ప్రతినిధి లలిత, ప్రజాచైతన్య సంస్థ ప్రతినిధి చెన్నారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

టీడీపీని అధికారంలోకి తీసుకురావడమే లక్ష్యం

● కడప నియోజకవర్గ ఇన్‌చార్జ్ మాధవీరెడ్డి


బాబు ష్యూరిటీ భవిష్యత్తు గ్యారంటీలో కరపత్రాలు అందిస్తున్న మాధవీరెడ్డి

కడప (ఎడ్యుకేషన్), జనవరి 4 :రాష్ట్రంలో అరాచకపాలన అధికమైందని టీడీపీ ప్రభుత్వం అధికారంలోకి వస్తే ఈ అరాచక పాలనకు చరమగీతం పా డవచ్చని టీడీపీ కడప నియోజకవర్గ ఇన్‌ఛార్జ్ ఆర్.మాధవీరెడ్డి తెలిపారు.గురువారం కడప నగరం 20వ డివిజన్ మారుతీనగర్ జీవీఆర్ అపార్ట్‌మెంటులో బాబు ష్యూరిటీ భవిష్యత్తు గ్యారంటీలో భాగంగా ఇంటింటికీ వెళ్లి కరపత్రాలు అందించారు.

చంద్రన్న వస్తేనే అందరి జీవితాలు బాగుపడేది

● బాబుతోనే భవిష్యత్తు గ్యారంటీలో విజయభాస్కర్‌రెడ్డి


చెన్నూరులో బాబుతోనే భవిష్యత్తు గ్యారంటీ కార్యక్రమంలో టీడీపీ నేతలు

చెన్నూరు, జనవరి 4: టీడీపీ అధినేత చంద్రబాబు సీఎం అయితేనే అందరి జీవితాలు బాగుపడతాయని ఆ పార్టీ మండల కన్వీనరు కె.విజయభాస్కర్‌రెడ్డి అన్నారు. చెన్నూరు, కొక్కిరాయపల్లె గ్రామాల్లో గురువారం బాబుతోనే భవిష్యత్తు గ్యారంటీ కార్యక్రమం నిర్వహించారు. విజయభాస్కర్‌రెడ్డి మాట్లాడుతూ వైసీపీకి రోజులు దగ్గరపడ్డాయన్నారు. కొక్కిరాయపల్లె సర్పంచ్ సూర్యనారాయణ, బలిజ సంఘం నేతలు జడ లక్ష్మీనారాయణ, అతికారి విశ్వం, ఎంకే కాంత్, పట్టణ అధ్యక్షుడు ఆకుల చలపతి పాల్గొన్నారు.

వేములలో...వచ్చే ఎన్నికల్లో టీడీపీకి అండగా నిలవాలని ఆ పార్టీ మండల పరిశీలకుడు మారెడ్డి జోగిరెడ్డి ప్రజలను కోరారు. గురువారం నారేపల్లె గ్రామంలో టీడీపీ-జనసేన ఉమ్మడి కార్యచరణలో బాగంగా ప్రవేశపెట్టిన మినీ మేనిఫెస్టోలోని పథకాలను ప్రజలకు వివరించారు. మండల ఇన్‌చార్జి బ్రహ్మయ్య, టీడీపీ నాయకులు నారేపల్లె రమణారెడ్డి పాల్గొన్నారు.

బైజూస్‌తో ఒప్పందం రద్దుచేసుకోకుంటే ఉద్యమం తీవ్రతరం

● ఏఐఎస్ఎఫ్, ఏఐవైఎఫ్

కడప (ఎడ్యుకేషన్), జనవరి 4 : ఆర్థిక మోసాలకు పాల్పడుతున్న బైజూస్ సంస్థతో ప్రభుత్వం ఒప్పందం చేసుకోవడం సహిగ్గుచేటని, రద్దు చేయకుంటే ఆందోళన ఉధృతం చేస్తామని ఏఐఎస్ఎఫ్ రాష్ట ప్రధాన కార్యదర్శి శివారెడ్డి, జిల్లా కార్యదర్శి వలరాజు, ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్షుడు దస్తగిరి హెచ్చరించారు. గురువారం కడప నగరం సీపీఐ జిల్లా కార్యాలయంలో వారు మాట్లాడుతూ దేశవ్యాప్తంగా విద్య పేరుతో అనేక అక్రమాలకుపాల్పడుతూ 9200 కోట్లు మనీ లాండరింగ్ కేసుల్లో ఎన్‌ఫోర్స్‌మెంటు డైరక్టరేట్ నమోదుచేసిందని, ఈ సంస్థ దివాళా తీస్తుందని, ఆ సంస్థకు ప్రభుత్వం రూ.9వేలు విలువ చేసే ట్యాబ్‌లను రూ.13వేలకు కొనేట్లు ఒప్పందం చేసుకుందన్నారు. రూ.3500 కోట్ల ప్రజాధనాన్ని బైజూస్‌కు దోచి పెడుతుందన్నారు. కోచింగ్‌ల పేరుతో విద్యార్థుల తల్లిదండ్రుల నుంచి అధిక మొత్తంలో వసూలు చేస్తున్నట్లు ఆరోపించారు. ఆ సంస్థతో ఒప్పందం రద్దు చేసుకోవాలన్నారు. ఏఐఎస్ఎఫ్ నాయకలు శివశంకర్, చంద్ర, ఎఐవైఎఫ్ నాయకులు చైతన్య, నాగార్జున, అఖిరానంద్, అశోఖ్, బాషా, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా కాలభైరవ స్వామి జయంతి

కడప (ఎర్రముక్కపల్లె), జనవరి 4 : కడప నగరం కాలభైరవపురంలో కాలభైరవస్వామి జయంతి వేడుకను పురస్కరించుకుని బాసట సేవా సంస్థ ఘనంగా జ యంతి వేడుకలు నిర్వహించింది. స్వామి మూలమూర్తుల వారికి పంచామృతాభిషేకం, అష్టోత్తరం, కాలభైరవ స్తోత్రం, కూష్మాండ దీప సేవారాధన, హోమం త దితర కార్యక్రమాలు శ్రీధరశర్మ ఆధ్వర్యంలో నిర్వహించారు.

వీరశివారెడ్డి, మాధవీరెడ్డి ప్రత్యేక పూజలు

కమలాపురం మాజీ ఎమ్మెల్యే వీరశివారెడ్డి దంపతులతో పాటు టీడీపీ కడప నియోజకవర్గ ఇన్‌చార్జ్ ఆర్.మాధవీరెడ్డి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం అన్న ప్రసాద వితరణ చేశారు. ఈ కార్యక్రమానికి దిశ పోలీసుస్టేషన్ డీఎస్పీ రమాకాంత్, వారి కుటుంబ సభ్యులు, బాసట స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులు పాల్గొన్నారు.

రాష్ట్రాభివృద్ధి కోసం టీడీపీని ఆదరించండి

● బాబుతోనే భవిష్యత్తు గ్యారెంటీలో పుత్తా నరసింహారెడ్డి

పెండ్లిమర్రి, జనవరి 4: రాష్ట్రాభివృద్ధిని కోరుకునే ప్రతి ఒక్కరు తెలుగుదేశం పార్టీకి ఓటు వేయాలని టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు, కమలాపురం నియోజకవర్గ ఇన్‌చార్జి పుత్తా నరసింహారెడ్డి అన్నా రు. గురువారం మండలంలోని తుమ్మలూరు పంచాయతీలోని గోపరాజుపల్లె, తుమ్మలూరు గ్రామాలలో పుత్తా నరసింహారెడ్డి బాబు ష్యూరిటీ-భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా ఇంటింటికి వెళ్లి టీడీపీ మేనిఫెస్టోను వివరిస్తూ పథకాల ద్వారా కలి గే ప్రయోజనాలను వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రజల సంక్షేమానికై అనేక పథకాలు అమలు చేసేందుకు సూపర్‌సిక్స్ మేనిఫెస్టో విడుదల చేశామన్నారు. ఈ మేనిఫెస్టోలో ప్రతి కుటుంబానికి లబ్ధి చేకూరుతుందని వివరించారు. కావున వచ్చే ఎన్నికల్లో టీడీపీని గెలిపించాలని కోరారు. మండల అధ్యక్షుడు గంగిరెడ్డి, క్లస్టర్ ఇన్‌చార్జి కిషోర్‌రెడ్డి, రాష్ట్ర తెలుగు యువత కార్యదర్శి చంద్ర ఓబుళరెడ్డి, రాజగోపాల్‌రెడ్డి, జిల్లా కార్యనిర్వాహక కార్యదర్శి శ్రీనివాస్‌రెడ్డి, చీమలపెంట సర్పంచు ప్రతాపరెడ్డి, జిల్లా ఎస్సీ సెల్ అధికార ప్రతినిధి రామాంజనేయులు, టీడీపీ నాయకులు ఈశ్వర్‌రెడ్డి, కెపి నరసింహారెడ్డి పాల్గొన్నారు.


మాట్లాడుతున్న టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పుత్తా నరసింహారెడ్డి

‘ఆకలి బాధలు తీర్చడమే లక్ష్యం’

కడప (కల్చరల్), జనవరి 4 : పేదల ఆకలి బాధలు తీర్చడమే తన లక్ష్యమని ఎస్.సుభాన్‌బాషా పేర్కొన్నారు.గురువారం ఆయన స్థానిక ఎన్టీఆర్ సర్కిల్ వద్ద ఉచితంగా భోజనం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అన్నం పరబ్రహ్మ స్వరూపమని, అన్ని దా నాల్లో కెల్లా అన్నదానం గొప్పదన్నారు. ఈ ఉచిత భోజన సదుపాయం ఏయే రోజుల్లో ఉంటుందో చర్చించుకుని నిర్ణయం తీసుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో విజయ్, రఫి, సుకుమార్, అబ్దుల్‌కలాం, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

నూతన విద్యావిధానాన్ని రద్దు చేయాలి

కడప (ఎడ్యుకేషన్), జనవరి 4 : కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం తెచ్చిన నూతన జాతీయ విద్యావిధానం రద్దు చేయాలని పీఎస్‌యూ రాష్ట్ర కార్యదర్శి సుబ్బరాయుడు డిమాండ్ చేశారు. గురువారం కడపనగరం ప్రభుత్వ ఐటీఐ కళాశాలలో పీఎస్‌యు ఆధ్వర్యంలో పార్లమెంటు మార్చ్ పోస్టరు ఆవిష్కరణ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీజేపీ తెచ్చిన ఎన్‌యుపీ రద్దు చేయాలని దేశానికి కాపాడుకుందామని పిలుపునిచ్చారు. ప్రభుత్వవిద్యారంగాన్ని కాపాడుకోవడమే తమ లక్ష్యమని అన్నారు. దేశ వ్యాప్తంగా 50వేలమంది సంఘ నాయకులు, విద్యార్థులు పాల్గొంటున్నారన్నారు.

వ్యక్తి అరెస్టు.. మద్యం బాటిళ్లు స్వాధీనం

కడప (క్రైం), జనవరి 4 :సాయిపేటలోని ఆటోస్టాండు వద్ద బెల్టుషాపు నిర్వహిస్తున్న వ్యక్తిని అరెస్టు చేసినట్లు కడప టూటౌన్ ఎస్ఐ సంజీవరాయుడు తెలిపారు. ఆయన వివరాల మేరకు సాయిపేటకు చెందిన ఆనంద్ శ్రీనివాసులు బెల్టుషాపు నిర్వహిస్తున్నట్లు సమాచారం వచ్చినట్లు తెలిపారు. అతడిని అరెస్టు చేసి 8 మద్యం బాటిళ్లు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు.

యాటగిరిని సత్కరించిన కొల్లు రవీంద్ర

కడప (ఎర్రముక్కపల్లె), జనవరి 4 : టీడీపీ జయహో బీసీ కార్యక్రమానంతరం టీడీపీ బెస్త సాధికార సమితి రాష్ట్ర కన్వీనరు యాటగిరి రాంప్రసాద్‌ను మాజీమంత్రి బీసీ సెల్ రాష్ట్ర అధ్యక్షులు కొల్లు రవీంద్ర సత్కరించారు. అమరావతిలో గురువారం జయహో బీసీ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమానంతరం రాంప్రసాద్‌ను సత్కరించిన కొల్లు రవీంద్ర మాట్లాడుతూ టీడీపీ హయాంలో బెస్తలకు నిర్వహించిన అభివృద్ధి కార్యక్రమాల పట్ల వారికి అవగాహన కల్పిస్తూ టీడీపీ బలోపేతానికి విశేషంగా కృషి చేస్తున్న రాంప్రసాద్‌ను అభినందించారు. అలాగే టీడీపీ బలోపేతానికి మరింత కృషి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ బెస్త సాధికార కమిటి నాయకులు పాల్గొన్నారు.

రూ.3 వేలు పెన్షన్ పంపిణీ

సీకేదిన్నె, జనవరి 3: ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన హామీ మేరకు రూ.3 వేలు పెన్షన్‌ను పంపిణీ చేస్తున్నట్లు కమలాపురం ఎమ్మెల్యే రవీంద్రనాథరెడ్డి తెలిపారు. చింతకొమ్మదిన్నెలో గురువారం జడ్పీటీసీ నరేన్ రామాంజులరెడ్డితో కలిసి పింఛన్ పంపిణీ చేపట్టారు. ఎంపీడీఓ రవికుమార్‌రెడ్డి, ఈవోఆర్‌డీ శ్రీధర్, వైద్యాధికారి రాఘవేంద్ర, నాయకులు ప్రభాకర్‌రెడ్డి, శ్రీనివాసుల రెడ్డి, రాజశేఖర్‌రెడ్డి, కళాయాదవ్, రాంప్రసాద్‌రెడ్డి, శివశంకర్, కృష్ణయ్య, సూరి, వేణు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కారమయ్యే వరకు సమ్మె ఆగదు

కడప (నాగరాజుపేట), జనవరి 4: సమస్యలు పరిష్కారమయ్యే వరకు సమ్మె ఆగదని అంగన్వాడీలు హెచ్చరించారు. వారి సమ్మె గురువారానికి 24వ రోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా స్థానిక అర్బన్ ప్రాజెక్టు కార్యాలయం ఎదుట ఒంటికాలిపై వినూత్నరీతిలో నిరసన తెలియజేశారు. ఈ సందర్భంగా సీఐటీయూ నగర ప్రధాన కార్యదర్శి పి.వెంకటసుబ్బయ్య, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి వి.అన్వేష్, డీవైఎఫ్ఐ నగర కార్యదర్శి డీఎం ఓబులేసులు మాట్లాడుతూ 24 రోజులుగా అంగన్వాడీలు రోడ్డున పడి సమ్మె చేస్తున్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదన్నారు. పైగా అంగన్వాడీలపై అబద్ధాలను ప్రచారం చేస్తుండటం దారుణమన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం కళ్లు తెరిచి అంగన్వాడీల ప్రధాన డిమాండ్లు తీర్చాలని, లేకుంటే సమ్మె విరమించే ప్రసక్తే లేదని తేల్చి చెప్పారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ యూనియన్ నాయకురాలు అంజనీదేవి, దీప, వినీలా, వసుంధర్ పాల్గొన్నారు.


సమ్మె నిర్వహిస్తున్న అంగన్వాడీ కార్యకర్తలు

అంగన్వాడీలపై ప్రభుత్వ మొండివైఖరి వీడాలి: డీవైఎఫ్ఐ

అంగన్వాడీలపై ప్రభుత్వ మొండివైఖరి విడనాడాలని, అంగన్వాడీలతో పెట్టుకున్న ఏ ప్రభుత్వమైనా కొనసాగిన దాఖలాలు లేవని డీవైఎఫ్ఐ కడప నగర కార్యదర్శి డీఎం ఓబులేసు హెచ్చరించారు. గురువారం 24వ రోజు సమ్మెలో ఓబులేసు పాల్గొని మాట్లాడారు. అంగన్వాడీలకు ఉద్యోగ భద్రత కల్పించాలని, సమాన పనికి సమాన వేతనం రూ.26వేలు ఇవ్వాలని, సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం గ్రాడ్యుటీ చెల్లించాలని డిమాండ్ చేశారు. ఈ డిమాండ్ల సాధన కోసం 24 రోజులుగా తిండీతిప్పలు మాని, రోడ్లపైనే అంగన్వాడీలు సమ్మె చేస్తున్నా ప్రభుత్వానికి చీమకుట్టినట్లు కూడా లేకపోవడం దారుణమన్నారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి బాగాలేదని చెబుతూనే మరో వైపు అన్ని సమస్యలు పరిష్కరించాం.. అయినా సమ్మె ఎందుకు చేస్తున్నారని అం గన్వాడీలపై తప్పుడు ప్రచారం చేయడం నీచమన్నారు. కుటుంబాలకు దూరమై, పస్తులతో ఉంటూ పండుగలు పబ్బాలు చేసుకోకుండా ఉంటున్న అంగన్వాడీలపై బురద చల్లడం సిగ్గుచేటన్నారు. ప్రభుత్వం ఎన్ని కుతంత్రాలు పన్నినా వెనుకడుగు వేసే ప్రసక్తే లేదన్నారు. తాడోపేడో తేల్చుకోనిదే సమ్మె విరమించేది లేదని హెచ్చరించారు. మున్ముందు అంగన్వాడీ సత్తా ఏంటో ప్రభుత్వానికి రుచి చూపిస్తామన్నారు. అంగన్వాడీ నాయకురాలు నాగలక్ష్మి, సావిత్రి, మంగోలి పాల్గొన్నారు.

వేంపల్లెలో... న్యాయమైన సమస్యలు పరిష్కరించే వారకు సమ్మె ఆపేది లేదని అంగన్వాడీ ఉద్యోగులు స్పష్టం చేశారు. నెల నెలరోజులుగా అంగన్వాడీ ఉద్యోగులు వేతనం పెంచాలని, గ్రాట్యుటీ ఇవ్వాలని తదితర డిమాండ్లతో అంగన్వాడీలు సమ్మెకు దిగారు. స్థానిక ఐసీడీఎస్ కార్యాలయం ఎదుట బైటాయించి ధర్నా చేస్తున్నారు. ప్రభుత్వం మొద్దు నిద్ర వీడాలన్నారు. ఎట్టి పరిస్థితుల్లోను సమస్యలు పరిష్కరించాల్సిందేనని ప్రభుత్వాన్ని హెచ్చరించారు.

ఆశాల సమస్యలు పరిష్కరించాలి

చెన్నూరు, జనవరి 4 : ఆశా కార్యకర్తల సమస్యలు ప్రభుత్వం వెం టనే పరిష్కరించాలని ఆశా కార్యకర్తల సంఘం రాష్ట్ర అధ్యక్షురాలు సుభాషిణి పేర్కొన్నారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయ ఆవరణంలో గురువారం ఆశా కార్యకర్తలతో కలిసి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆశా కార్యకర్తలకు ఇప్పటి వరకు వేతనాల పెంపు కానీ, పీఎఫ్ సౌకర్యం కానీ, ఉద్యోగభద్రత కానీ లేవన్నారు. ఆశాలచేత వెట్టిచాకిరీ చేయించుకోవడం దుర్మార్గమ న్నా రు. రాష్ట్ర సహాయ కార్యదర్శి అయ్యవారమ్మ, మండల ఆశా కార్యకర్తల నాయకురాళ్లు అనసూయ, ముకుంద, ఉమామహేశ్వరి, సుజాత, సుమలత, తులసి, సుబ్బలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.


చెన్నూరులో నిరసన తెలియజేస్తున్న ఆశా కార్యకర్తలు

‘ఆడుదాం ఆంధ్రా’ ఉద్యోగులకు మాత్రమేనా

● పేద క్రీడాకారులకు ప్రోత్సాహం ఇవ్వరా: బీజేపీ

వేంపల్లె, జనవరి 4: పేద క్రీడాకారులకు భాగస్వామ్యం లేకుండా, వారికి ప్రోత్సాహం ఇవ్వకుండా ఉద్యోగులు మాత్రమే ఆడుదాం ఆంధ్రాలో పాలు పంచుకోవడం ఎంత వరకు సమంజసమని బీజేపీ నేతలు అధికారులను ప్రశ్నించారు. వేంపల్లెలో ఆడుదాం ఆంధ్రా పోటీల ప్రాంగణాన్ని బీజేపీ జిల్లా కార్యదర్శి గాలి హరిప్రసాద్, మహిళా నాయకురాలు సుష్మ సందర్శించారు. ఆడుదాం ఆంధ్రాలో వలంటటీర్లు, ఉద్యోగులు మాత్రమే పాల్గొనడం పేద క్రీడాకారులు పెద్దగా హాజరుకాకపోవడాన్ని గుర్తించి ఎంపీడీఓ దివిజకు ఈ విషయాన్ని తెలియజేశారు. ప్రభుత్వం అందిస్తున్న ప్రజాధనంతో పేద క్రీడాకారులకు మంచి చేయాలని ఏదో కార్యక్రమం జరిగిందనిపించేలా ముందుకు సాగడం ఏమాత్రం సమంజసం కాదన్నారు.


ఎంపీడీఓతో మాట్లాడుతున్న గాలి హరిప్రసాద్ తదితరులు

రేషన్ సరుకులు సక్రమంగా అందించాలి

వేంపల్లె, జనవరి 4: రేషన్ సరుకులను సక్రమంగా అందించాలని జాయింట్ కలెక్టర్ గణేష్‌కుమార్ డీలర్లను ఆదేశించారు. ఫిర్యాదులు వస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. వేంపల్లె బియ్యం స్టాక్ గోడౌన్‌ను జేసీ గురువారం తనిఖీ చేశారు. గండి రోడ్డులో రేషన్ షాపును తనిఖీ చేశారు. కార్డుదారులతో మాట్లాడారు. తహసీల్దార్ చంద్రశేఖర్‌రెడ్డి, ఆర్ఐ లోకేష్ పాల్గొన్నారు.


సి. రామచంద్రయ్యను అభినందిస్తున్న తెలుగు యువత మాజీ ప్రధాన కార్యదర్శి ఎద్దుల శంకర్, నగర అధ్యక్షుడు శివకొండారెడ్డి, రవిశంకర్‌రెడ్డి, శ్రీధర్, మాదినేని బాలకృష్ణ తదితరులు

రాబోయే ఎన్నికల్లో జగన్‌రెడ్డి పతనం ఖాయం

● టీడీపీ జిల్లా అధ్యక్షుడు లింగారెడ్డి

కడప (ఎడ్యుకేషన్), జనవరి 4:రాబోయే ఎన్నికల్లో సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పతనం ఖాయమని టీడీపీ జిల్లా అధ్యక్షుడు మల్లేల లింగారెడ్డి గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. వైసీపీ ప్రభుత్వంపై ప్రజల్లో తిరుగుబాటు మొదలైందన్నారు. ప్రజాగ్రహంతోనే ఆ పార్టీ నేతలు ఆ పార్టీని వీడుతున్నారన్నారు. ఒక్క ఛాన్స్ అని చెప్పి ప్రజల్లో విశ్వాసం కల్పించి మోసం చేసిన సీఎం జగన్‌రెడ్డి అన్నారు. ఓటమి భయం, జగన్ ప్రభుత్వంపై వస్తున్న తిరుగుబాటు కారణంగా వైసీపీ ఎమ్మెల్యే, ఎంపీలు పోటీకి దూరమవుతున్నారన్నారు.

అనాథ వృద్ధులకు దుప్పట్లు పంపిణీ

వేంపల్లె, జనవరి 4: వేంపల్లె రాజీవ్‌నగర్ కాలనీలోని మ దర్‌థెరిస్సా అనాథ వృద్ధాశ్రమంలోని అనాథలకు వికాస్ స్కూల్ కరస్పాండెంట్ రఫి య ఆధ్వర్యంలో దుప్పట్లు పంపిణీ చేశారు. పాఠశాల పిల్లలు పొదుపు చేసిన కొంత డబ్బు, పాఠశాల యాజమా న్యం కలిసి వృద్ధులకు దుప్పట్లను వితరణగా అందించడం ఆనందించదగ్గ విషయమని నిర్వాహకులు వెంకటసుబ్బయ్య తెలిపారు. వ్యవస్థాపకులు నజీర్, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

మాజీ మంత్రి కొల్లు రవీంద్రను కలిసిన బీసీ నాయకులు

సింహాద్రిపురం, జనవరి 4: టీడీపీ నాయకుడు, మాజీ మంత్రి కొల్లు రవీంద్రను గురువారం కడప జిల్లా బీసీ నాయకులు కలిశారు. విజయవాడలో గురువారం జరిగిన టీడీపీ బీసీ సెల్ సమావేశానికి వారు హాజరయ్యారు. సమావేశం అనంతరం జిల్లా పార్లమెంటు బీసీ సెల్ ఉపాధ్యక్షుడు మురళీ మోహన్ యాదవ్, నాగభూషణం తదితరులు కొల్లు రవీంద్రను శాలువతో సన్మానించి, బొకే అందజేశారు. తెలుగు దేశం పార్టీ అభివృద్ధికి బడుగు, బలహీన వర్గాల నాయకులు కృషి చేయాలని కొల్లు రవీందర్ ఈ సందర్భంగా సూచించినట్లు వారు తెలిపారు. వచ్చే ఎన్నికల్లో టీడీపీ ప్రభుత్వం రావడం తథ్యమని, పార్టీ కోసం కష్టపడిన ప్రతి కార్యకర్తకు గుర్తింపు ఉంటుందని ఆయన తెలియ జేసినట్లు మురళీ మోహన్ యాదవ్ పేర్కొన్నారు.


కొల్లు రవీంద్రను సన్మానిస్తున్న బీసీ సంఘం నాయకులు మరళీమోహన్ యాదవ్ తదితరులు

సమాజ సేవే లక్ష్యంగా ఎన్ఎస్ఎస్ పనిచేయాలి

కడప (ఎడ్యుకేషన్), జనవరి 4 : సమాజ సేవే లక్ష్యంగా ఎన్ఎస్ఎస్ విద్యార్థులు విధులు నిర్వహించాలని ప్రిన్సిపాల్ సూర్యరావు పిలుపునిచ్చారు.గురువారం ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాల ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో ర వీంద్రనగర్‌లో స్పెషల్ క్యాంపు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థుల వ్యక్తిత్వాన్ని అభివృద్ధి చేయడం విద్యార్థుల్లో సామాజిక సంక్షేమాన్ని పెంపొందించడం స మాజానికి సేవ అందించడం ఎన్ఎస్ఎస్ ముఖ్య ఉద్దేశ్యమన్నారు. వలంటీర్లు జీవన ప్రమాణాలను మెరుగుపరచడానికి గౌరవ ప్రదమైన జీవితాన్ని గడపడానికి అవసరమైన వారికి సహాయం అందేలా పనిచేయాలని సూచించారు.

‘కాంగ్రెస్‌కు పూర్వవైభవం’

పులివెందుల టౌన్, జనవరి 4: రానున్న రోజుల్లో కాంగ్రెస్‌కు పూర్వవైభవం వస్తుందని పులివెందుల నియోజకవర్గ ఇన్‌చార్జి శ్రీనివాసరెడ్డి అన్నారు. వైఎస్ షర్మిల కాంగ్రెస్‌పార్టీలో చేరడంపై గురువారం పులివెందులలోని కాంగ్రెస్ కార్యాలయం వద్ద ఆపార్టీ నాయకులు సంబరాలు చేసుకున్నారు. కాంగ్రెస్ నాయకులు శ్రీకాంత్, వెంకటేశ్, మధు తదితరులు పాల్గొన్నారు.

చెన్నూరులో... షర్మిల రాకతో కాంగ్రెస్ పార్టీకి పూర్వ వైభవం వచ్చినట్లేనని కమలాపురం నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జ్ పొట్టిపాటి చంద్రశేఖర్‌రెడ్డి అన్నారు. చెన్నూరులో గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ వైఎస్ పాలనలో కాంగ్రెస్ ఎలా ఉండేదో ఆయన కుమార్తె షర్మిలతో నేడు అలాగే ఉండబోతుందన్నారు.

ప్రభుత్వ దిష్టిబొమ్మతో మున్సిపల్ కార్మికుల శవయాత్ర

కడప (చిన్నచౌకు), జనవరి 4 : కడప నగర మున్సిపల్ కాంట్రాక్టు పారిశుధ్య కార్మికులు తమ న్యాయమైన డిమాండ్ల సాధన కోసం గత పదిరోజులుగా ఉద్యమిస్తున్న సంగతి తెలిసిందే. అందులో భాగంగా గురువారం కడప మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయం వద్ద కళ్లకు గంతలు కట్టుకుని వినూత్న రీతిలో నిరసనకు దిగారు. అనంతరం కార్మికులు ప్రభుత్వ దిష్టిబొమ్మతో శవయాత్ర నిర్వహించారు. కడప మున్సిపల్ కార్యాలయం వద్ద నుంచి రైతు బజారు బ్రిడ్జి వరకు ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ ప్రభుత్వ దిష్టిబొమ్మతో శవయాత్ర కొనసాగించారు. ఈ కార్యక్రమంలో సీఐటియు, ఎఐటియుసి అనుబంధ సంస్థ కార్మిక నాయకులు మాట్లాడుతూ మున్సిపల్ కార్మికులకు ఇచ్చిన హామీలు నెరవేరుస్తాడనే నమ్మకంతో జగన్‌కు ఓట్లు వేసి గెలిపిస్తే ఇచ్చిన హామీలను నెరవేర్చకపోగా అడిగిన పాపానికి అక్రమంగా అరెస్టులు చేయించడం దారుణమన్నారు. ఇదంతా యావత్ ప్రజానీకం గమనిస్తున్నారని 2024 ఎన్నికల్లో జగన్ ప్రభుత్వానికి సమాధి కడతారని హెచ్చరించారు. ఇకనైనా ప్రభుత్వం మొండి వైఖరి విడనాడి మున్సిపల్ కార్మికులకు ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు.

అరుణాచలంలో దుప్పట్లు పంపిణీ

కడప (ఎర్రముక్కపల్లె), జనవరి 4 : కడప నగరం ఎన్జీఓ కాలనీ విశ్వప్రగతి చిట్‌ఫండ్స్ ప్రైవేటు లిమిటెడ్ మేనేజింగ్ డైరెక్టరు తుంగా రమణయ్య బుధవారం రాత్రి ప్రముఖ పుణ్యక్షేత్రం అరుణాచలంలో గిరిప్రదక్షిణలో భాగంగా 400 మందికి దుప్పట్లు పంపిణీ చేశారు.నాయుడు, రాజశేఖర్, ఎరసాని నిరంజన్‌రెడ్డి,పెద్దిరెడ్డి రఘునాథరెడ్డి మిత్ర బృందం తదితరులు పాల్గొన్నారు.


దుప్పట్లు పంపిణీ చేస్తున్న తుంగా రమణయ్య

సమస్యలు పరిష్కరించే వరకు సమ్మె ఉధృతం

- అంగన్వాడీల హెచ్చరిక
- 24వ రోజు కొనసాగిన సమ్మె

జమ్మలమడుగు, జనవరి 4: తమ సమస్యలు పరిష్కరించాలంటూ అంగన్వాడీలు చేస్తున్న సమ్మె గురువారం నాటికి 24వ రోజుకు చేరుకుంది. జమ్మలమడుగులో అంగన్వాడీ కార్యకర్తలు, ఆయాలు చేస్తున్న నిరసన కార్యక్రమంలో అంగన్వాడీ కార్యకర్తలు, అసోసియేషన్ నాయకులు మాట్లాడుతూ మొండిగా వ్యవహరించే ముఖ్యమంత్రి జగన్‌కు బుద్ధిచెబుతామన్నారు. ముఖ్యమంత్రి జగన్ ఇచ్చిన హామీ మేరకు తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతున్నా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని.. జరగబోయే ఎన్నికల్లో పతనం తప్పదన్నారు. అనంతరం మండలంలోని మోరగుడి, పట్టణంలోని అంగన్వాడీ కేంద్రాలను సచివాలయ సిబ్బంది తెరిచారని సమాచారం రావడంతో కొందరు అంగన్వాడీ కార్యకర్తలు అక్కడకు వెళ్లి హెచ్చరించారు. తమకు ఇబ్బంది కలిగిస్తుంటే అధికారులు చెప్పిన విధంగా అంగన్వాడీ సెంటర్లను తెరువడం మంచి పద్ధతి కాదని చెప్పినట్లుగా అంగన్వాడీ కార్యకర్తలు తెలిపారు.

ఆటో లాగుతూ... నిరసన

పోరుమామిళ్ల, జనవరి 4: స్థానిక తహసీల్దారు కార్యాలయం ఎదుట సీఐటీయూ ఆధ్వర్యంలో జరుగుతున్న అంగన్వాడీల సమ్మె గురువారం 24వ రోజుకు చేరింది. ఈ సందర్భంగా అంగన్వాడీలు అంబేద్కర్ విగ్రహం ఎదుట ఆటో లాగుతూ నిరసన చేపట్టారు. సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు భైరవ ప్రసాద్ మాట్లాడుతూ అంగన్వాడీలు రోడ్డెక్కి జీతాలు పెంచాలనే ఆందోళన చేస్తుంటే.. ప్రభుత్వం 5వ తేదీలోగా విధుల్లో చేరకుంటే ఉద్యోగం తీసివేస్తామని భయభ్రాంతులకు గురి చేయడం దారుణమన్నారు. సీఐటీయూ జిల్లా కమిటీ సభ్యురాలు విజయమ్మ, మేరీ, వినోదాదేవి, దస్తగిరమ్మ, జ్యోతమ్మ తదితరులు పాల్గొన్నారు.

పొర్లుదండాలు పెడుతూ...

కొండాపురం, జనవరి 4: మండలంలోని అంగన్వాడీలు గురువారం కొండాపురంలో పొర్లుదండాలు పెట్టి తమ నిరసన వ్యక్తం చేశారు. జగన్ చిత్రపటం ఎదుట పొర్లుదండాలు పెడుతూ నీకు మా ఓట్లు నీ గోవిందా అంటూ నినాదాలు చేశారు. సీఐటీయూ నేతలు తారాదేవి, జ్యోతి, పద్మ, స్వర్ణకుమారి, వెంకటసుబ్బమ్మ, వరలక్ష్మి, శిరీష, శివపార్వతి, విజయలక్ష్మి, రామతులసి,తదితరులు పాల్గొన్నారు.

మైదుకూరులో కొనసాగుతున్న సమ్మె

మైదుకూరు, జనవరి 4: తమ సమస్యలు పరిష్కరించాలంటూ అంగన్వాడీ కార్యకర్తలు చేస్తున్న సమ్మె గురువారం నాటికి 24వ రోజుకు చేరుకుంది. స్థానిక ఎంపీడీవో కార్యాలయం వద్ద ఏఐటీయూసీ, సీఐటీయూ సంయుక్త ఆధ్వర్యంలో సమ్మె దీక్షలు చేస్తున్నారు. తమ సమస్యలు పరిష్కరించేంత వరకు సమ్మెబాటలో ఉంటామని, ప్రభుత్వమే జీతభత్యాలు పెంచి ఆదుకోవాలని, బెదిరింపులకు పాల్పడితే సహించేదీ లేదంటూ తేల్చి చెప్పారు.

ముద్దనూరులో..: స్థానిక తహసీల్దారు కార్యాలయం ఎదుట అంగన్వాడీలు చేపడుతున్న దీక్షలు గురువారానికి 24వ రోజుకు చేరుకున్నాయి. సీఎం జగన్ అంగన్వాడీలకు ఇచ్చిన హామీలు నెరవేర్చే వరకు దీక్షలు ఆపేదిలేదన్నారు.

చాపాడులో..: తహసీల్దారు కార్యాలయం ఎదురుగా గురువారం అంగన్వాడీ కార్యకర్తలు ధర్నా నిర్వహించారు. సీఎం జగన్ వెంటనే తమ సమస్యలు పరిష్కరించాలని వారు కోరారు. ఏపీటీఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు శ్యాంసుందర్‌రెడ్డి వారికి మద్దతు తెలిపారు.

జీవో ప్రతులు దహనం

బద్వేలు రూరల్, జనవరి 4: తమ న్యాయమైన సమస్యలు పరిష్కరించాలని అంగన్వాడీలు పోరాటం చేస్తుంటే.. ఈనెల 5వ తేదీ లోపు విధులకు హాజరు కాకపోతే చర్యలు చేపడతామంటూ రాష్ట్ర ప్రభుత్వం జీవో జారీ చేసింది. ఇందుకు సంబంధించిన జీవో ప్రతులను గురువారం స్థానిక సీడీపీవో కార్యాలయం ఎదుట దహనం చేశారు. సీఐటీయూ జిల్లా కార్యదర్శి శ్రీనివాసులు మాట్లాడుతూ అంగన్వాడీలు తమ సమస్యలు పరిష్కరించాలని సమ్మెలోకి వెళితే.. సచివాలయం ఉద్యోగుల ద్వారా అంగన్వాడీ కేంద్రాలు నడపాలని చూడడమే కాకుండా.. ఈనెల 5న అంగన్వాడీలు విధులకు హాజరుకాకుంటే చర్యలు చేపడతామనడం ప్రభుత్వ అహంకారధోరణికి నిదర్శనమన్నారు. కార్యక్రమంలో డీవైఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు చిన్ని, సీఐటీయూ జిల్లా కార్యదర్శి నాగేంద్రబాబు, అంగన్వాడీ నాయకులు హసేనమ్మ, సుభాషిణి, సత్యవతి, కళావతి, రాధమ్మ పాల్గొన్నారు.



చాపాడులో నిరసన వ్యక్తం చేస్తున్న అంగన్వాడీ కార్యకర్తలు



జమ్మలమడుగులో నిరసన తెలుపుతున్న అంగన్వాడీలు



పోరుమామిళ్లలో ఆటో లాగి నిరసన తెలుపుతున్న దృశ్యం

సైకో ప్రభుత్వాన్ని సాగనంపుదాం : భూపేష్‌రెడ్డి



టీడీపీలో చేరిన వారితో ఇన్‌ఛార్జ్‌భూపేష్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్సీలు నారాయణరెడ్డి, శివనాథరెడ్డి

పెద్దముడియం, జనవరి 4: రాబోవు సార్వత్రిక ఎన్నికల్లో సైకో ప్రభుత్వాన్ని పారద్రోలి సైకిలు ప్రభుత్వాన్ని తీసుకొద్దామని జమ్మలమడుగు టీడీపీ ఇన్‌ఛార్జ్ భూపేష్‌రెడ్డి పేర్కొన్నారు. మండల పరిధిలోని జె.కొట్టాలపల్లెలో గురువారం భూపేష్‌రెడ్డి ఆధ్వ ర్యంలో గ్రామానికి చెందిన వైసీపీకి చెందిన 75 కుటుంబాలు టీడీపీ తీర్థం పుచ్చుకున్నాయి. పార్టీలో చేరిన వారిలో యనమల క్రిష్టారెడ్డి, గడ్డం శేఖర్‌రెడ్డి, రఘునాథరెడ్డి, విజయరామిరెడ్డి, బాషా, వెంకటరెడ్డి, వెంకటేశ్వర్‌రెడ్డి, భాస్కర్‌రెడ్డి, పరమేశ్వర్‌రెడ్డి, కళావతితో పాటు మహిళలు పెద్ద ఎత్తున ఉన్నారు. ఈసందర్భంగా భూపేష్‌రెడ్డి మాట్లాడుతూ తుగ్లక్ జగన్‌రెడ్డి పాలనలో అన్ని రకాలుగా విఫలమయ్యారన్నారు. వైసీ పీ నాయకులు మునిగిపోయే నావలా కాకుండా రాష్ట్రాన్ని అభివృద్ధి వైపు నడిపించే విజ నరీ లీడరు చంద్రబాబు వైపు చూస్తున్నారన్నారు. రానున్న ఎన్నికల్లో టీడీపీకి ఓటు వేసి ఎమ్మె ల్యేగా తనను, సీఎంగా చంద్రబాబును ఎన్నుకోవాలని ప్రజలను కోరా రు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు ఎమ్మెల్సీలు నారాయణరెడ్డి, శివనాథరెడ్డి, గ్రామ నాయకులు చంద్రమౌళీరెడ్డి, శివారెడ్డి, మస్తాన్, వంగల బ్రహ్మానందరెడ్డి, రామసుబ్బారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

చంద్రబాబుతోనే భవిష్యత్ గ్యారెంటీ : పుట్టా



కానగూడూరులో భవిష్యత్ గ్యారెంటీపై ప్రచారం చేస్తున్న పుట్టా సుధాకర్‌యాదవ్

దువ్వూరు (మైదుకూరు), జనవరి 4 : రాష్ట్ర భవిష్యత్ చంద్రబాబుతోనే గ్యారెంటీ అని.. ప్రజలు ఏకపక్షంగా ఇప్పటికే నిర్ణయించుకున్నారని టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ పుట్టా సుధాకర్ యాదవ్ పేర్కొన్నారు. టీడీపీ ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న భవిష్యత్‌కు గ్యారెంటీ కార్యక్ర మంలో భాగంగా గురువారం సాయంత్రం ఆయన దువ్వూరు మండలం కానగూడూరులో ఇంటింటా పర్యటించారు. ఈ సందర్భంగా గ్రామస్తులు పుట్టాకు పూలమాలలు వేసి ఘన స్వాగతం పలికారు. అనంతరం ఇంటింట ఆయన తిరుగుతూ వైయస్ జగన్ ప్రభుత్వంపై అన్ని వర్గాల ప్రజల్లో నమ్మకం పోయిందని, సంక్షేమ పథకాలు తప్పితే ఎక్కడ కూడా రాష్ట్రం అభివృద్ధి చెందలేదన్నారు. సొంత కడప జిల్లాలో కూడా స్టీల్‌ప్లాంట్ గానీ నీటి ప్రాజక్టులు గానీ నిర్మించలేదన్నారు. ఉపాధి లేక వేలాదిమంది యువత రోడ్డుపాలయ్యారన్నారు. రాష్ట్రం అభివృద్ధి చెందాలంటే చంద్రబాబును సీయం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో టీడీపీ నాయ కులు రమణారెడ్డి సంజీవరెడ్డి, రాంబాబు, లక్షమయ్య, శేషయ్య, శివ, అన్వర్ పాల్గొన్నారు.

టీడీపీ మేనిఫెస్టోను ప్రజల్లోకి తీసుకెళ్లాలి : విజయమ్మ



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే విజయమ్మ

పోరుమామిళ్ల, జనవరి 4: వైసీపీ వైఫల్యాలను ప్రజలకు వివరిస్తూ.. టీడీపీ ఎన్నికల మేనిఫెస్టో ప్రజల్లోకి తీసుకెళ్లాలని బద్వేలు మాజీ ఎమ్మెల్యే కె.విజయమ్మ అన్నారు. గురువారం పోరుమామిళ్లలోని టీడీపీ కార్యాలయంలో పోరుమామిళ్ల, కాశినాయన మండల టీడీపీ నాయ కులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లా డుతూ టీడీపీ నాయకులు, కార్యకర్తలు ప్రతి పంచాయతీ, గ్రామంలో ప్రజల సమస్యలు తెలుసుకోవాలన్నారు. టీడీపీ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లి వారిని చైతన్య పరచాలన్నారు. ఇంటింటికీ తిరిగి టీడీపీ మేనిఫెస్టో తెలియజేయాలని.. వైసీపీ పాలనలో జరుగుతున్న అవినీతి అక్రమాలు తెలపాలన్నారు. కార్యక్రమంలో బద్వేలు టీడీపీ ఇన్‌చార్జ్ బొజ్జ రోశన్న, మార్కెట్‌యార్డు మాజీ చైర్మన్ చెరుకూరి చెన్న రాయుడు, మైనార్టీ నాయకులు మహబూబ్‌బాషా, హబీబున్నీసా, మండల టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

బీసీలకు అండగా ఉండేది టీడీపీనే..: వరద



ప్రజలతో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే వరదరాజులరెడ్డి

ప్రొద్దుటూరు, జనవరి 4 : బడుగు బలహీనవర్గాలకు అండగా వుండే ఏకైక పార్టీ టీడీపీనే అని మాజీ ఎమ్మెల్యే నంద్యాల వరదరాజులరెడ్డి పేర్కొన్నారు. గురువారం వసంతపేట మున్సిపల్ కార్యాలయం రోడ్డులో బాబూ ష్యూరిటీ భవిష్యత్తుకు గారెంటీ కార్యక్రమం వరదరాజులరెడ్డి ఆధ్వర్యంలో చేపట్టారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ టీడీపీ అధికారంలోకి వస్తే బీసీల సంక్షేమం, రక్షణ కోసం ప్రత్యేక చట్టం తీసుకురానున్నట్లు తెలిపారు. మాజీ ఎమ్మెల్సీ బచ్చల పుల్లయ్య మాజీ మున్సిపల్ చైర్మన్ ఆసం రఘురామిరెడ్డి, బద్వేలి రవిశంకర్‌రెడ్డి, రాజేంద్రనాథరెడ్డి, శ్రీధర్‌రెడ్డి, శంకర్‌రెడ్డి, ప్రతాప్‌రెడ్డి రఘునాథరెడ్డి, నందం రామయ్య తదితరులు పాల్గొన్నారు.

జగన్ ఎన్ని జిమ్మిక్కులుచేసినా ఓటమి ఖాయం

మహిళలకు ఉచిత బస్సు ప్రయాణంపై టీడీపీకి అవకాశం ఇవ్వరాదని చెప్పి ఉచిత బస్సు ప్రయాణం పథకానికి శ్రీకారం చుట్టే ప్రయత్నం చేస్తున్నారని.. కానీ జగన్ ఇలా ఎన్ని జిమ్మిక్కులు చేసినా వచ్చే ఎన్నికల్లో ఓటమి ఖాయమని టీడీపీ నాయకుడు నంద్యాల కొండారెడ్డి పేర్కొన్నారు. గురువారం వసంతపేట ఏరియా పవర్‌హౌస్ వీదులలో బాబూ ష్యూరిటీ భవిష్యత్తుకు గారెంటీ కార్యాక్రమం చేపట్టారు. టీడీపీ పట్టణ మాజీ అధ్యక్షుడు ఘంటశాల వెంకటేశ్వర్లు, చీమల రాజశేఖర్‌రెడ్డి, బాయికాడ బాబు, మాజీ కౌన్సి లర్లు నరసింహులు, స్థానిక టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

పేదలకు ఇంటి స్థలాలు ఇవ్వాలి



ధర్నా చేస్తున్న సీపీఐ నేతలు

గోపవరం, జనవరి 4: మండలంలోని పలు గ్రామాల్లో ఇళ్లు లేని నిరుపేదలు తీవ్ర అవ స్థలు పడుతున్నారని... ప్రభుత్వం ఇంటిస్థలాలు మంజూరు చేయాలని కోరుతూ గురువారం సీపీఐ మండల సమితి ఆధ్వర్యంలో తహసీల్దారు కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కార్యవర్గ సభ్యులు సీపీఐ వీరశేఖర్ మాట్లా_డుతూ ప్రతి గ్రామంలో పేదలు ఒక్కో ఇంటిలో ఇద్దరు ముగ్గురు కాపురాలు ఉండలేక ఇబ్బందులు పడుతున్నారని.. కొందరికి మాత్రమే స్థలం ఇచ్చారని.. మిగిలిన వారికి జగనన్న కాలనీలో స్థలాలు కేటాయించాలని అనేక దఫాలుగా ఆందోళనలు చేసినా స్పందన లేదన్నారు. ఇప్పటికైనా స్పందించి ఇంటిస్థలాలు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం డిప్యూటీ తహసీల్దారు మోహన్‌రాజు, ఆర్ఐ అమర్‌నాథరెడ్డికి వినతిపత్రం ఇచ్చారు. డీహెచ్‌పీఎస్ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంటు వెంకటరమణ, సీపీఐ నేతలు చంద్రమోహ న్‌రాజు, పెంచలయ్య తదితరులు పాల్గొన్నారు.

ఆశా కార్యకర్తలను మెడికల్ ఉద్యోగులుగా గుర్తించాలి

పోరుమామిళ్ల, జనవరి 4: ఆశాలను మెడికల్ ఉద్యోగులుగా గుర్తించి పర్మినెంటు చేయాలని ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి పిడుగు మస్తాన్, ఆశా యూనియన్ నాయకులు ఖతీజాబీ, చెన్నమ్మలు డిమాండ్ చేశారు. గురువారం మండలంలోని టేకూరుపేట ప్రాథమిక ప్రభుత్వాసుపత్రిలో ఏఐటీయూసీ అధ్వర్యంలో ఆశాలు నిరసన తెలిపారు.

పెండింగ్‌లో ఉన్న కరోనా అలవెన్స్ ఇవ్వాలి

ఖాజీపేట, జనవరి 4: సంవత్సరాలు గడుస్తున్నా కరోనా అలవెన్స్ ఇప్పటికి చెల్లించలేదని.. వెంటనే చెల్లించాలని ఏఐటీయూసీ ఆశా కార్యకర్తలు పద్మావతి, శ్రీదేవి, సునీత అన్నారు. గురువారం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వద్ద ఆశా వర్కర్లు నిరసన వ్యక్తం చేసి.. ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని, ఉద్యోగ భద్రత, సామాజిక భద్రత కల్పించాలని తదితర డిమాండ్లు చేశారు.

ట్రాన్స్‌ఫార్మర్లలో రాగివైరు చోరీ

కొండాపురం, జనవరి 4 : మండలంలోని ఎస్.తిమ్మాపురం గ్రామంలో బుధవారం రాత్రి పొలాల్లోని ట్రాన్స్‌ఫార్మర్లలో రాగివైరు చోరీకి గురయినట్లు రైతులు తెలిపారు.తిమ్మాపురం బైపాస్‌కు దగ్గరలో ఉన్న మల్లికార్జునరెడ్డి, కృష్ణుడు,రామాంజులరెడ్డి అనే రైతులకు చెందిన మూడు ట్రాన్స్‌ఫార్మర్లను పగలగొట్టి రాగివైరు చోరీ చేసినట్లు రైతులు పేర్కొన్నారు. ఈ మేరకు పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు వారు తెలిపారు.

వ్యవసాయ మోటరు వైర్లు...

అట్లూరు, జనవరి 4: అట్లూరు, వరికుంట, రెడ్డిపల్లె, అట్లూరు క్రాస్ రోడ్డు వద్ద పొలాల్లోని వ్యవసాయ మోటర్ల వైర్లు గురువారం చోరీకి గురైనట్లు సంబంధిత రైతులు తెలిపారు. చోరీకి గురైన వైర్ల విలువ సుమారు లక్ష రూపాయలు ఉంటుందని వారు తెలిపారు. పగలు పంట పొలాల్లో ఉండి ఇంటికి వచ్చిన తరువాత రాత్రి పూట గుర్తుతెలియని వ్యక్తులు ఈ చోరీకి పాల్ప డుతున్నట్లు వారు ఆవేదన వ్యక్తం చేశారు.

19 మద్యం బాటిళ్లు స్వాధీనం

పోరుమామిళ్ల, జనవరి 4 : అనుమతి లేకుండా మద్యం విక్రయిస్తున్న ఓబయ్య అనే వ్యక్తిని అరెస్టు చేసి... 19 మద్యం బాటిళ్లు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ మల్లికార్జునరెడ్డి తెలిపారు. గురువారం టేకూరుపేటలో ఓబయ్య అనే వ్యక్తి వద్ద మద్యం బాటళ్లు ఉండడంతో అరెస్టు చేసి, కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

ఇసుక అక్రమ రవాణా అరికట్టాలి

జమ్మలమడుగు, జనవరి 4: జమ్మలమడుగు ప్రాంతంలో ఇసుక అక్రమ దందా జోరుగా సాగుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదని బీజేపీ ఎస్సీ మోర్చ నాయకులు మేకల ఆంజనేయులు విమర్శించారు. గురువారం జమ్మలమడుగు తహసీల్దారు కార్యాలయం వద్ద వారు నిరసన తెలిపి మాట్లాడారు. జమ్మలమడుగు, మైలవరం మండలాల్లో అక్రమ ఇసుక రవాణా జోరుగా సాగుతున్నా అధికారులు చర్యలు తీసుకోవడంలేదన్నారు. కలెక్టర్, సంబంధిత అధికారులువెంటనే చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. కార్యక్రమంలో కుందవరం రాజు, యువరాజు, పెద్దులయ్య, సునీల్, కందుల సురేష్ తదితరులు పాల్గొన్నారు.

కనీస వేతనం ఇచ్చే వరకు పోరాటం ఆగదు



జమ్మలమడుగులో నిరసన తెలుపుతున్న మున్సిపల్ వర్కర్లు

జమ్మలమడుగు, జనవరి 4: ప్రభుత్వం తమ సమస్యలు పరిష్కరించి.. కనీస వేతనం ఇచ్చే వరకు పోరాటం ఆగదని మున్సిపల్ వర్కర్లు హెచ్చరించారు. జమ్మలమడుగు పట్టణంలోని మున్సిపల్ మస్టర్ పాయింట్ వద్ద గురువారం చేస్తున్న మున్సిపల్ వర్కర్ల సమ్మె 10వ రోజుకు చేరింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వం తమ సమస్యలు పరిష్కరించకుండా మొండిగా వ్యవహరిస్తోందన్నారు. కనీస వేతనం ఇవ్వాలని, పెరిగిన నిత్యావసర ధరలకు అనుగుణంగా కార్మికులకు జీత భత్యాలు పెంచాలని డిమాండ్ చేశారు. 2024 ఎన్నికల్లో బీజేపీ, వైసీపీకి గట్టిగా బుద్ధిచెబుతామన్నారు. ఈ కార్యక్రమంలో ఏపీ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ నాయకులు, సీఐటీయూ నాయకులు శేఖర్, ప్రతాప్, శివ, చిన్న, పుల్లన్న, ప్రభావతి, గ్రేసమ్మ, వినయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

మున్సిపల్ కార్మికులకు జగనన్న ఇచ్చిన హామీలు వొమ్ము

ప్రొద్దుటూరు, జనవరి 4: అధికారంలోకి రాక ముందు ఎన్నికల కోసం జగనన్న మున్సిపల్ కార్మికులకు ఇచ్చిన హామీలు వమ్ము చేశాడని మున్సిపల్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర కమిటీ సభ్యుడు విజయ్‌కుమార్ ఆరోపించారు. గురువారం స్థానిక మున్సిపల్ కార్యాలయం వద్ద కార్మికులు చేపట్టిన సమ్మె పదవ రోజుకు చేరుకుంది. ఈసందర్భంగా వారు పొర్లుదండాలతో నిరసన కార్యక్రమం చేపట్టారు. మంత్రుల చర్చలు సమ్మెను నీరుగార్చడానికి తప్ప కార్మికుల డిమాండ్లు పరిష్కరించేందుకు దోహదపడటం లేదన్నారు. ప్రభుత్వం వైఖరిని బట్టి సమ్మె కొనసాగుతుందన్నారు. యూనియన్ అధ్యక్షుడు చంటి, ప్రధా న కార్యదర్శి సాల్మన్, కోశాధికారి రాఘవ, ఉపాధ్యక్షురాలు గుర్రమ్మ రమాదేవి, ప్రమీళమ్మ, నీతమ్మ, ఓబయ్య, జాకోబు పాల్గొన్నారు. సమ్మెకు కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ నజీర్ మద్దతు ఇచ్చి పాల్గొన్నారు.

నియంత పాలనలో కార్మికులకు అవస్థలు

బద్వేలు, జనవరి 4: ముఖ్యమంత్రి జగన్ నియంత పాలనలో కార్మికులు అవస్థలు పడాల్సి వస్తుందని మాజీ ఎమ్మెల్యే కె.విజ యమ్మ పేర్కొన్నారు. ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి ఇచ్చిన హామీలు అమలు చేయాలని గురువారం మున్సి పల్ కార్మికులు రాష్ట్ర ప్రభుత్వ తీరును నిరశిస్తూ నల్లరిబ్బన్లతో కళ్లకు గంతలు కట్టుకుని నిరసన తెలిపారు. వీరికి టీడీపీ మాజీ ఎమ్మెల్యే విజయమ్మ మద్దతు తెలిపి మాట్లాడారు. ఇచ్చిన హామీలను అమలు చేయాలని మున్సిపల్ కార్మికు లు సమ్మె నిర్వహిస్తుంటే వైసీపీ ప్రభుత్వం పట్టించుకోకపోవడం దారుణ మన్నారు.

సమస్యలను పరిష్కరించడంలో ప్రభుత్వం విఫలం

కార్మికుల సమస్యలను పరిష్కరించడంలో వైసీపీ పభుత్వం విఫలం చెందిందని ఏఐటీయూసీ బద్వేలు పట్టణ కార్యదర్శి నాగేష్ పేర్కొన్నారు. గురువారం మున్సిపల్ కార్యాలయం ఎదుట వారు నిరసన తెలిపారు. కార్మికులతో చర్చలు జరిపి న్యాయమైన సమస్యలు పరిష్కరించాలన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ వర్కర్స్ యూనియన్ ప్రధాన కార్యదర్శి వెంకటసుబ్బయ్య, సీనియర్ నాయకులు రమణరావు, నరసింహులు, శ్రీనివాసరాజు, వెంకటేష్, పుల్లమ్మ, స్లీవమ్మ తదితరులు పాల్గొన్నారు.



ప్రొద్దుటూరులో మున్సిపల్ కార్మికులు పొర్లు దండాలు పెడుతున్న దృశ్యం

మైదుకూరులో కొనసాగిన సమ్మె

మైదుకూరు, జనవరి 4 : సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలంటూ స్థానిక మున్సిపల్ కార్యాలయం వద్ద పారిశుధ్య కార్మికులు చేపట్టిన సమ్మె కొనసాగుతోంది. కాంట్రాక్టు కార్మికులందరిని పర్మినెంట్ చేయాలని, బకాయిపడ్డ వేతనాలు చెల్లించడంతో పాటు సీపీయస్ రద్దు చేసి ఏపీయస్ విధానంలో పెన్షన్లు ఇవ్వాలని, కార్మికుందరికీ ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్లపై నిరసిస్తూ సమ్మె చేస్తున్నట్లు వారు పేర్కొన్నారు.

భద్రత లేని భూ హక్కు చట్టాన్ని రద్దు చేయాలి



జమ్మలమడుగు ప్రధాన రోడ్డులో ర్యాలీ చేస్తున్న న్యాయవాదులు

జమ్మలమడుగు, జనవరి 4: ప్రజల ఆస్తులకు ఏమాత్రం భద్రత లేని ప్రజావ్యతిరేక భూ హక్కు చట్టాన్ని ప్రభుత్వం వెంటనే రద్దు చేయాలని జమ్మలమడుగు, ప్రొద్దుటూరు, మైదుకూరు, కమలాపురం ప్రాంతాలకు చెందిన బార్ అసోసియేషన్ న్యాయవాదులు డిమాండ్ చేశారు. గురువారం ఉదయం జమ్మలమడుగు కోర్టు వద్ద నుంచి న్యాయవాదులు ర్యాలీ నిర్వహించారు. ప్రభుత్వం చేసిన చట్టాన్ని వెంటనే రద్దు చేయాలంటూ నిరసన వ్యక్తం చేశారు. ర్యాలీ పాత బస్టాండు గాంధీ విగ్రహం వద్దకు చేరుకుని మానవహారం చేపట్టారు. ఈ సందర్భంగా పలువురు న్యాయవాదులు ప్రభుత్వాన్ని విమర్శించారు. భారతదేశంలో లేని భూ హక్కు చట్టం ఈ ప్రభుత్వం తెచ్చి పెట్టిందన్నారు. యాక్టు 27 జీవో నెం.512 లోపభూయిష్టంగా ఉందన్నారు. ఆంధ్రప్రదేశ్‌లో ఎక్కడైనా పొలంకానీ, స్థలంకానీ ఉంటే బయటి ప్రాంతాల్లో ఉన్నవారికి తెలియకుండా రిజిష్టర్ చేయించుకుని రెండు సంవత్సరాలు దాటితే దానికి రక్షణ ఉండదన్నారు. అనంతరం ఆర్డీవో కార్యాలయం ఎదురుగా ఈ చట్టానికి వ్యతిరేకంగా న్యాయవాదులు నినాదాలు చేశారు. అనంతరం ఆర్డీవో శ్రీనివాసులకు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో జమ్మలమడుగు, ప్రొద్దుటూరు, మైదుకూరు, కమలాపురం, ప్రాంతాలకు చెందిన బార్ అసోసియేషన్ న్యాయవాదులు, మహిళా న్యాయవాదులు పాల్గొన్నారు.

ఈశ్వరీదేవి అమ్మవారి దేవస్థాన అభివృద్ధికి కృషి

బ్రహ్మంగారిమఠం, జనవరి 4: జగన్మాత ఈశ్వరీదేవి మఠం దేవస్థానం అభివృద్ధికి తమ వంతు కృషి చేస్తామని రాష్ట్ర విశ్వబ్రాహ్మణ సంఘం జేఏసీ చైర్మన్ పావులూరి హనుమంతరావు, ప్రధాన కార్యదర్శి ప్రముఖ న్యాయవాది గురుప్రసాద్‌లు తెలిపా రు. గురువారం స్థానిక విశ్వకర్మ అన్నదాన సత్రంలో అమ్మవారి ఆరాధన గురుపూజా మహోత్సవాలపై సమావేశం అయ్యారు. ముఖ్యఅతిథులుగా మఠాధిపతులు వీరకుమారస్వామి, అచలానంద ఆశ్రమం మఠాధిపతులు విరజా నందస్వామి హాజరయ్యారు. ఈ సందర్భంగా హనుమంతరావు, గురుప్రసాద్ మాట్లాడుతూ రాబోవు రోజుల్లో విశ్వబ్రాహ్మణసంఘం ఆధ్వర్యంలో రూ.పది కోట్ల నిధులతో ఈశ్వరిదేవి మఠం దేవస్థానాన్ని అభివృద్ధి చేస్తామని తెలిపారు. అలాగే ఆరాధన గురుపూజ సందర్భంగా అమ్మవారు జీవసమాధి వహించిన పవిత్రదినం కావడంతో శుక్రవారం రాష్ట్ర నలుమూలల నుంచి విశ్వబ్రాహ్మణ మహిళా మూర్తుల ఆధ్వర్యంలో అమ్మవారికి సారె, పట్టువస్త్రాలు, కుంకుమ, పసుపు సమర్పించడం జరుగుతుందన్నారు. శుక్రవారం ఉదయం 7గంటల నుంచి వైభవంగా గ్రామోత్సవంలో ర్యాలీగా వెళ్లి అమ్మవారికి సారె అందించడం జరుగుతుందని తెలిపారు. జేఏసీ చైర్మన్ హనుమంతరావు, ఈశ్వరీదేవి శక్తిపీఠం అధ్యక్షురాలు పార్వతమ్మ, విశ్వబ్రాహ్మణ సంఘం నేతలు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించేందుకే విద్యుత్ అదాలత్

పోరుమామిళ్ల, జనవరి 4: రైతుల, విద్యుత్ వినియోగదారుల సమస్యలు పరిష్కరించేందుకే ప్రత్యేక విద్యుత్ అదాలత్ నిర్వహించామని విద్యుత్‌శాఖ ఏడీఏ బీసీ నాయక్ అన్నారు. గురువారం స్థానిక విద్యుత్ కార్యాల యంలో ప్రత్యేక విద్యుత్ అదాలత్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆరుగురు రైతులు ట్రాన్స్‌ఫార్మర్లు కావాలని వినతి పత్రం అందించారు. రంగసముద్రం పంచాయతీ పరిధిలోని ఎస్టీకాలనీలో ఎల్‌సీ లైను కావాలని దరఖాస్తు చేసుకున్నారు.